# గోశాల నిర్మాణము

1. రూ. 10,000-00 శ్రీ సిక్కినము తరుణ్ గారు, బెంగుళూరు
2. రూ. 10,000-00 శ్రీ సి.హెచ్. శ్రీరామారావు గారు, విశాఖపట్నం
3. రూ. 10,000-00 శ్రీ గొల్లపూడి కామేశ్వరరావు గారు (తాతగారు) గొల్లప్రోలు
4. రూ. 4,500-00 శ్రీ నిడమర్తి రామకృష్ణ గారు, పెదనింద్ర కాలనీ
5. రూ. 50,000-00 శ్రీమతి & శ్రీ సార్థిక్ గారు, లక్నో
6. రూ. 10,000-00 శ్రీమతి రాయపురెడ్డి అనూష గారు & శ్రీ రాయపురెడ్డి ఉదయ్‌తేజ్ గారు (U.S.A), (శ్రీ గోపు తాతమ్మ గారి మనుమరాలు)
7. రూ. 5,000-00 శ్రీ గణేష్ ఆచార్య గారు, శ్రీమతి రాజేశ్వరి ఆచార్య గారు, శాంతి ఆశ్రమం యిదివరలో ఇచ్చిన దానికి అదనముగా

# విరాళములు

1. రూ. 1200-00 శ్రీ కె. సూర్య ప్రకాశరావు గారు, కాకినాడ
2. రూ. 1008-00 శ్రీ పి.వి.వి. భగవాన్ గారు, శాంతి ఆశ్రమం, పూజలు, పండుగలు నిమిత్తం
3. రూ. 2,000-00 శ్రీమతి ఎమ్. ప్రమీలా కుమారి గారు, హైదరాబాద్ అన్నదానం నిమిత్తం
4. రూ. 2,500-00 పూజ్యశ్రీ జపానంద స్వామి గారు, శ్రీ శాంతి ఆశ్రమం, వీరి తల్లిదండ్రులు కీ॥శే॥ డి. సూరన్న గారు & కీ॥శే॥ శ్రీమతి చిట్టెమ్మ గార్ల ఆత్మశాంతి కోరుతూ
5. రూ. 2,500-00 శ్రీ గొల్లపూడి భాస్కరరావు గారు, గొల్లప్రోలు
6. రూ. 25,000-00 శ్రీ రవి గారు & శ్రీమతి ప్రసన్న గార్లు, హైదరాబాద్
7. రూ. 5,100-00 శ్రీమతి పుష్పాజీ గారు, హైదరాబాద్
8. రూ. 1100-00 శ్రీ చిదానందస్వామి శిష్య బృందం, శ్రీ చిదానందస్వామి పుట్టినరోజుసందర్భంగా
9. రూ. 1000-00 డా॥ టి. వసంత గారు, విశాఖపట్నం
10. రూ. 1000-00 శ్రీ ఎ.వి.యస్. మోహనశర్మ గారు, శ్రీ శాంతి ఆశ్రమం, వీరి తల్లి గారు కీ॥శే॥ ఆలూరు లక్ష్మీ కమల గారి ఆత్మశాంతి కోరుతూ
11. రూ. 1000-00 శ్రీ కాకర సత్యనారాయణ గారు, పెదపూడి
12. రూ. 1,116-00 శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి ప్రెస్, రాజమండ్రి ఈ సంస్థ అభివృద్ధి కోరుతూ

# విద్యానిధి

1. రూ. 25,000-00 శ్రీ బి. వీరభద్రరావు గారు, విశాఖపట్నం వీరి భార్య కీ॥శే॥ శ్రీమతి బి. పద్మావతి గారి జ్ఞాపకార్థము

# కనస్ట్రక్షన్ & ఇంప్లిమెంటేషన్

1. రూ. 2,50,000-00 శ్రీ చాడ సీతారామశాస్త్రి గారు, బిలాస్‌పూర్, ఛత్తీష్‌గడ్.



ॐ

# శాంతి

**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీ స్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**గౌరవ సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

**సంపుటి : 93** **నవంబరు - 2017** **సంచిక : 11**

## విషయసూచిక

పేజి నెం.

1. ప్రార్థన - శివమహిమ్నా స్తోత్రం 02
2. ధ్యానము - శంభు నటనము 03
3. ప్రణవము - బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు 05
4. ధ్యానము - స్వామి ఓంకార్, అనువాదం : స్వామి తత్త్వవిదానంద 09
5. శ్రీ కృష్ణ భక్తి ప్రధానమైన వ్రతము - సేకరణ : శ్రీమతి వాడ్రేవు శారద 14
6. శ్రీరామ గీత - వినతి 20
7. కర్మ - సాధువు భీష్మాజీ 23
8. భగవద్గీత - జమ్మలమడక సుబ్బలక్ష్మి 26
9. విజ్ఞప్తి - గోశాల పునర్నిర్మాణము 27
10. వార్తలు - విరాళాలు 28

☛ ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి - రచయితలే బాధ్యులు కాని, సంపాదకులు కారు. – **ఎడిటర్**

*జీవిత సభ్యత్వం (12 సం॥) : రూ. 1000/-* *సాలుసరి చందా : రూ. 100/-*

# ప్రార్థన

## (శివ మహిమ్నా స్తోత్రం)

*- పుష్పదంత విరచితం*

**భగవత్ భక్తి పూతమైన హృదయంలో ఈశ్వరుడు ప్రతిఫలిస్తాడు**

శ్లో॥ క్రియాదక్షో దక్షః క్రతుపతి రధీశ స్తనుభృతాం
ఋషీణా మార్త్విజ్యం శరణద పదస్యాః సురగణాః ।
క్రతుభ్రంశ స్త్వతః క్రతుఫల విధాన వ్యసనినో
ధ్రువం కర్తుః శ్రద్ధావిధుర మభిచారాయ హి మఖాః ॥

**తాత్పర్యం :** ఆశ్రితులకు శరణమయ్యే ప్రభూ! కర్మకాండలో సమర్థుడు, ప్రజాపతి అయిన దక్షుడు స్వయంగా యజమాని. ఋషులు పౌరోహిత్యం వహించారు. దేవతాగణాలు సదస్యులు. అయినా క్రతుఫలాన్ని ఇవ్వడమే వ్యసనంగా కల నీవు ఆ యజ్ఞాన్ని ధ్వంసం చేశావు. శ్రద్ధా విరహితమైన యజ్ఞాలు యజమాని నాశనానికే దారి తీస్తాయి. అందులో అనుమానం లేదు.

**వ్యాఖ్య :** శివుని పట్ల పగ పెంచుకొని దక్షుడు ఆయనని సరకుగొనక యజ్ఞాన్ని చేయడానికి పూనుకొన్నాడు. హంగులన్నీ ఉన్నాయి. అయితే ఫలప్రదాత అయిన పరమాత్మలో విశ్వాసం లేకుండా చేసిన ఆ కర్మ దక్షుని నాశనానికే దారి తీసింది. భగవంతునిలో నమ్మకం లేని క్రియల్ని ఎంత నిర్దుష్టంగా నెరవేర్చితే మాత్రం ఏమి ప్రయోజనం? పరమేశ్వరునికి ప్రీతి కలిగించలేని కర్మకాండ హానికరమౌతుంది.

**"ఓర్పు అనేది బలహీనతకు సంకేతం కానే కాదు. అది బలానికి గుర్తు. ఈ భూమాత, పర్వతాలను అడవుల భారాన్ని ఇంకా అనేక జీవరాశులను వేల సంవత్సరాలుగా ఎంతో ఓర్పుతో భరిస్తూ వస్తోంది. ప్రతి ఒక్క జీవికి ఆహారాన్ని రక్షణను కల్పిస్తూ వస్తోంది. బలహీనమయిన మనస్సు వెదయినా ఒక చర్య జరిగినప్పుడు దానికి ప్రతిక్రియగా స్పందించడం చేస్తుంది. కాని గొప్ప మనస్సు మాత్రం స్వయంగా ఒక నిర్ణయాన్ని తీసుకుని దానిని అనుసరించి పనిచేస్తుందే గాని, ప్రతిక్రియను చేపట్టదు. చర్య అనేది ఒక సహజమయిన సంగతి. ప్రతిక్రియ అనేది హానికరం కాబట్టి ఓరిమి అనేది గొప్ప కళ".**

**- శారదామాత**



# ధ్యానము

## (శంభు నటనము)

**ధ్యానము వల్ల భగవంతుడు ఒక్కడే అని గ్రహించగలుగుతాము.**

అనంతమహిమం త్రిదశవంద్యచరణం మునిహృదంతరవసంతమమలం
కబంధనియదింద్వవనిగంధవహవహ్నిమఖబంధురవిమంజువపుషం
అనంతవిభవం త్రిజగదంతరమణిం త్రినయనం త్రిపురఖండనపరం
సనందమునివందితపదం సకరుణం పరచిదంబరనటం హృది భజ.

**తాత్పర్యం :** ఆయన మహిమ అంతం లేనిది. దేవతలు నిత్యమూ ఆయన పాదాలకు వందనం చేస్తూ వుంటారు. మునుల హృదయంలో నిర్మలమైన వసంతం వలె వసిస్తూ వాళ్లకి ఆహ్లాదాన్ని కలిగిస్తూ ఉంటారు. పంచభూతాలు, సూర్యచంద్రులు, పురుషుడు అనే అష్ట మూర్తులుగా సంచరించే అనంత వైభవం ఆయనది. మూడులోకాలని ప్రకాశింపజేసే మణి ఆయన. మూడు నేత్రాలు కలిగివుండి, మూడు పురాలని ఖండించి సనందముని చేత స్తుతింపబడే పదమైన కరుణమూర్తి పరచిదంబరేశ్వరుణ్ణి హృదయంతో భజించు !

**వ్యాఖ్య :** కబంధ మంజువపుషం = ఈ దృశ్య ప్రపంచం పంచభూతాలు, సూర్యచంద్రులు, పురుషుడు అనే అష్టమూర్తి రూపం అని శాస్త్రాలు వర్ణిస్తాయి. ఈ అష్టమూర్తులుగా శివుడే ఉదయించాడని విష్ణుపురాణం చెబుతుంది. సృష్టి చెయ్యాలనే సంకల్పంతో బ్రహ్మదేవుడు ధ్యానమగ్నుడై కూర్చొని వుండగా ఆయన నొసటి నుండి ఒక చిన్న కుర్రవాడు బయటకు వచ్చి ఏడుస్తూ పరిగెత్తడం మొదలుపెట్టాడు. "ఎందుకేడుస్తున్నావు" అని బ్రహ్మదేవుడడిగాడు. "నాకు పేరు పెట్టు" అంటూ ఆ కుర్రవాడు తిరిగి ఏడ్చాడు. రుద్ర, భవ, శర్వ, ఈశాన, పశుపతి, భీమ, ఉగ్ర, మహాదేవ అని ఎనిమిది పేర్లు పెట్టి వాళ్ళు ఉండడానికి పై ఎనిమిది స్థానాలని ఏర్పాటు చేసేవరకు ఆ పిల్లవాడు ఏడుస్తూనే ఉన్నాడు.

అంటే నామరూపరహితమైన ఏకశుద్ధ చైతన్యం జీవలోకంలోకి ప్రవేశించి "నేను" అన్న ప్రత్యేకతని పొంది "ఇది" అని చూచి అనుభవాలు పొందడం కోసం ఎనిమిది రూపాలు పొందింది. ప్రపంచంలో కోట్లాది జీవుళ్ళున్నా అందరిలోను అనుభవాలు పొందేది "నేను" ఒక్కటే. ఈ "నేను"కి ఇన్ని భేదాలు రావడానికి కారణం పంచభూతాలు. వాటిని సృజించి ఇరవై నాలుగు తత్త్వాలుగా చీల్చి "నేను"ని ఆవరింపజేసి వేరుచేసే మాయయే రుద్రుని ఏడుపు. ఏకంలో అనుభవాలు లేవు. 'నేను' వేరుగా ఉండి 'ఇది' అనే దానిలో వైవిధ్యం

ఉండి, దానిని గ్రహించడానికి చిన్న చిన్న పరికరాలు వుండి, నడవడానికి వేర్వేరు మార్గాలు ఉంటే అనంతకోటి జీవుళ్లవుతారు.

అయిదు సూక్ష్మతత్త్వాలు వేరుగానూ, కలిసే అయిదు జ్ఞానేంద్రియాలనూ అయిదు కర్మేంద్రియాలనూ, అయిదు ప్రాణాలనూ, నాలుగు అంతఃకరణలనీ తయారుచేయగా, అయిదు స్థూలభూతాలు కలిసి జీవుడి స్థూలశరీరాన్ని, శబ్ద, స్పర్శ, రూప, రస గంధాలనే అనుభవాలనిచ్చే స్థూల విషయ ప్రపంచాన్ని తయారు చేస్తాయి.

ఇందులో సంచరించే పురుషుడు సూర్యదృష్టితోనో, చంద్రదృష్టితోనో తన జీవితాన్ని గడిపి వేర్వేరు లోకాలకి వస్తూ, పోతూ, పుట్టుతూ, గిట్టుతూ వుంటాడు.

తమోగుణంతో విషయ భోగాలలో మునిగి జీవితాన్ని వృథా చేసుకోవడం చంద్రమార్గం. చురుకుగా విచక్షణతో వ్యవహరించి పైకి రావడం సూర్యమార్గం. ఈ రెండూ "నేను" యొక్క వ్యవహారాలే. ఇది కేవలం ఆట, విలాసక్రీడ. అందుకే "మంజువపుషం" అనడం.

**త్రిజగదంతర మణిం :** జాగ్రత్స్వప్న సుషుప్తులనే మూడులోకాలని ప్రకాశింపజేసే మణి ఆయన ఒక్కడే.

**త్రినయనం, త్రిపుర ఖండన పరం :** రెండు నేత్రాలే ఉన్నప్పుడు అజ్ఞానంలో ఈ నామ రూప జగత్తులోనే సంచరిస్తూ జీవుడు పుట్టుతూ గిట్టుతూ జాగ్రత్స్వప్న సుషుప్తి ప్రపంచాల అనుభవాలలో ఇరుక్కుపోతాడు.

జ్ఞాననేత్రం అనే మూడో కన్ను కలిగినప్పుడు ప్రపంచానికి ఆధారమైన శుద్ధ చైతన్య స్వరూపాన్ని పొందాలనే ప్రబల కాంక్షతో మూడు లోకాలకి కారణమైన స్థూల సూక్ష్మ కారణ శరీరాలనే మూడుపురాలని నాశనం చెయ్యడమే జీవితలక్ష్యంగా పెట్టుకొంటాడు.

**సనంద మునివందిత పదం :** ఈ పరమపదాన్ని మననశీలులై శోకాన్ని అతిగమించి ఆనంద రూపులైన మహాత్ములే గుర్తించి కీర్తిస్తారు. ఆ మునులకి జరావ్యాధి మరణాలు లేవు. నిత్యమూ అయిదేళ్ల బాలకులవలె ఉంటారు.

**"ఎవ్వరూ లేని ఇంట్లో కనబడిన డబ్బు సంచిని దొంగిలించాలనే దురాశకు లోబడనివాడే నిజమైన పారమర్థికుడు".**

**- శ్రీరామకృష్ణ పరమహంస**



# ప్రణవము

**(శ్రీ శాంతి ఆశ్రమ శతజయంతి ఉత్సవాల సందర్భంగా తేది. 30-11-2016న కాకినాడ శాఖలో ఇచ్చిన దివ్య సందేశము)**

***- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరావు***

## హృదయమందు మ్రోగు ఓంకార ధ్వనులను విన్నవాడే యోగి

*(గత సంచిక తరువాత)...*

**"శబ్ద బ్రహ్మమయీ, చరాచరమయీ, జ్యోతిర్మయీ, వాఙ్మయీ"** అంటారు మీనాక్షీ స్తోత్రంలో శ్రీ శంకర భగవత్ పాదులవారు.

సమస్త శబ్దములు దేనిలోనికి వెళ్లిపోతాయో, ఆదిలో నుంచి ఉత్పన్నమవుతాయి. ఏ "ఓం" కారము నుండి మూడు రూపములు ఉత్పన్నమయ్యాయో, ఏ "ఓం" కారములోనికి సమస్త జగత్తు లయమౌతుందో, నాదస్వరూపంగా మళ్లీ అదొక కోణం, అలాగే ఇక్కడ ఉండే టటువంటి నాదంలోకే సర్వశబ్దములూ లయమైపోతాయ్. ఎవరు సంగీత విద్వాంసుడు అంటే, "నాదము"ను తెలుసుకొన్నవాడు. మీరు ఏమీ అనుకోకపోతే నా దృష్టిలో అంత మహితాత్ముడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారు నాద మహిమనెరిగినవారు. ఆయనకి నాదము బాగా తెలుసు. అందుకే 'నాదశరీరశంకర' అని వేటూరి సుందరరామమూర్తి గారు అంటే 'నాదతనుమనిషం శంకరం' అని త్యాగరాజస్వామి అంటారు. అసలు నాదం శివుని యొక్క శరీరం. ఆ నాదం ఎక్కడ ఉంటుందంటే, సమస్త శబ్దములు ఎక్కడ నుండి ఉత్పన్నమ వుతున్నాయో, సమస్త శబ్దములు దేనియందు లయమైపోతాయో, ఏ శబ్దమూ లేనప్పుడు సంగీత శాస్త్రపరంగా చెప్పాలంటే, స్వర, తాళములు, రాగము లేకుండ పాట పాడుతుండగ మధ్యలో భావము నిశ్శబ్దమైపోయి, ఎక్కడ నుండి ఉత్పన్నమైపోయిందో, అక్కడికి వెళ్లిపోయి యోగిగా విద్వాంసుడు నిలబడిపోతాడో, వాడు నాదయోగి. అందుకే పాట పాడుతూ, పాడుతూ మధ్యలో ఆకస్మాత్తగా నిశ్శబ్దం వస్తుంది. ఒక ప్రవచనం చేస్తున్నారనుకోండి, నిశ్శబ్దం వస్తుంది.

'సంధ్యారంభ విజృంభితం, శృతి శిరస్థరానిశ్చితం' అంటారు శ్రీ శంకరులు. నేను మాట్లాడుతున్నప్పుడు నాలో భావాలు నిప్పుకణికల్లా బయటకు రేగుతున్నా మాట్లాడుతున్నప్పుడు ఊపిరి కోసం ఒక్కసారి ఆగుతాను. ఆగినప్పుడు మధ్యలో నిశ్శబ్దం ఉంటుంది "సంధ్య". మళ్లీ ఊపిరి తీసినప్పుడు విజృంభిస్తుంటుంది వాక్కు. అలాగే విద్వాంసుడు ఏం చేస్తుంటాడంటే, సంగీతం పాడుతూ పాడుతూ ఆకస్మాత్తుగా మధ్యలో దానియందు రమిస్తూ నిశ్శబ్దమైపోతాడు.

అప్పుడు సమస్త శబ్ధములూ ఆయనే. ఉపాసన ఎక్కడ నుండి ఉత్పన్నమయ్యాయో అక్కడికి వెళ్ళిపోతాడు మూలస్థానానికి. మళ్లీ ఒకసారి విజృంభిస్తాడు. ఇదే "నాదతనుమనిషం శంకరం" అన్న దాన్ని ఆధారం చేసుకునే వేటూరి సుందర రామూర్తి గారు "నాదశరీరా పరా వేద విహార హరా" యదార్ధముగా త్యాగరాజ స్వామి కీర్తననే తెలుగులోకి తీసుకొచ్చారు. దాన్ని అదే క్రమంలో వెండి తెరమీదికి ఎక్కించినప్పుడు 'శంకరా' అన్నప్పుడు ఒక్క క్షణం ఆపి, మళ్లీ పాట మొదలెట్టించారు. నాదయోగి అని చెప్పించడానికి చలనచిత్రంలో, తెలుగులో వచ్చినటువంటి చలన చిత్రాలలో అత్యంత గాంభీర్యమైనటువంటి సన్నివేశాలు ఉన్నాయి. ఏదీ తక్కువ అని మాట్లాడకూడదు. మంచి ఎక్కడున్నా మంచే, కాబట్టి శబ్ధములన్నీ ఎక్కడ లయమైపోతున్నాయో, అది "ప్రణవము"–"నాదము"–"ఓం", అందుకే దీర్ఘ ప్రణవమును సంసారులు పలుకరాదు అని పెద్దలు యొక్క ఆజ్ఞ. వైరాగ్యము కలుగుతుందని, హ్రస్వ ప్రణవమే తప్ప దీర్ఘ ప్రణవమును పలుకవద్దు సంసారములో ఉన్నన్నాళ్లూ అంటారు. సరే అది వేరుగా విచారణ చేయవలసినటువంటి విషయం. మహానుభావులు చెప్పిన మాట నేను చెబుతున్నాను, నా స్వంత మాట కాదు. కాబట్టి సమస్త శబ్ధరాశి ఎందులో నుంచి వస్తుందంటే 'ఓం'లోంచి వస్తుంది. అందుకే మీరు ప్రణవాన్ని అనువాదం చేస్తే భగవంతుడి యొక్క రూపాలు అవుతాయి. 'ఓంకార రూపిణి' అని అమ్మవారికి పేరు. అసలు విఘ్నేశ్వరుణ్ని, ఆయన బొమ్మ గీసినప్పుడు ప్రణావాన్ని సంస్కృతంలో గీసి మారిస్తే, అదే విఘ్నేశ్వరుడవుతాడు. "ప్రణవస్వరూపా వక్రతుండం" అని ముత్తుస్వామి దీక్షితులవారు అనడానికి కారణం అదే. "ప్రణవ స్వరూపుడు" విఘ్నేశ్వరుడు, అలాగే "ప్రణవధరుడు" అని పరమశివుడికి పేరు. ప్రణవాన్ని ధరించాడు 'ఓంకారాన్ని' అని, శబ్దస్వరూపంగా, "నాదస్వరూపిణి" అని అమ్మవారి పేరు. అలాగే అందులోంచి మొట్టమొదట యాభై ఒక్కటి (51) అక్షరములు పుడతాయి. అది 'శబ్దోత్పత్తి' అంటారు. 'మాతృకా వర్ణరూపిణీ' అంటారు. అక్షర బ్రహ్మము, అక్షరము శబ్ధమునకు నేను ఆ "ఓం"కారమును కంఠము నందు ధరించుచున్నాను. ఎలా ధరిస్తున్నాను అంటే, ఒక కత్తి ధరించాలి అనుకొన్నటువంటివాడు తప్పకుండా దానికి ఒక ఒరను ధరించవలసి వుంటుంది. కత్తిని కత్తిగా ఒంటికి కట్టుకోరు. కట్టుకుంటే అది తన ఒంటినే కోస్తుంది. కత్తిని ధరించాలనుకొన్నటువంటివాడు, ఒక కోశము అంటే ఒక వర కట్టుకొని, వరలో పెట్టుకుంటాడు. అలా "బ్రహ్మణః కోశోఽసి మేధయా పిహితః" నేను ఆ పరబ్రహ్మమును అనుభవములోనికి తెచ్చుకొనుట కొరకు, ఆ పరబ్రహ్మమును ధరించుట కొరకు, ఈ ఓం కారమును ఈ ప్రణవమును కోశమునగునట్లు స్వీకరించుచున్నాను. ఆ పరబ్రహ్మము యొక్క కోశమే పరబ్రహ్మమనబడేటటువంటి కత్తిని దాచడానికి ఉపయోగపడేటటువంటి 'ఒర'కు మారుపేరుయే "ప్రణవము". అటువంటి "ప్రణవము" ఏది ఉన్నదో, "శ్రుతం మే గోపాయ!" మేము విన్నటువంటి భద్రమైన వాక్కులు, గురువులు అందించినటువంటి జ్ఞానము, ఋషులు



మహోదారులై అందించినటువంటి శృతి (వేదము, ఇవి ఏవి ఉన్నవో, వాటిని రక్షించుగాక!. "శ్రుతం మే గోపాయ!" దానిచేత లోకమునందంతటికి గూడ "శాంతి" లభించు గాక!

ఓం శాంతిః శాంతిః శాంతిః ! అని మూడుసార్లు చెబితే, అది పరమ సత్యము అని గుర్తు. మన వేదం, "ఓంకారము"ను గురించి చెప్పినటువంటి పరమాద్భుతమైనటువంటి మంత్ర విశేషం. అటువంటి "ఓంకారము" యదార్ధమునకు పరబ్రహ్మమునకు సంకేతనామం. అదే పరబ్రహ్మం యొక్క పేరు. అందుకే "ఓంకారము"ను చేయడం, "ఓం"కారమును జపం చేయడం అనేటటుదానికి కొంత అధికారము అవసరం అవుతుంది. సాధారణంగా తురీయా ఆశ్రమంలో ఉన్నటువంటివాళ్లు ప్రణవోపదేశాన్ని పొంది, ప్రణవం లోపల్నించి వస్తుంటుంది అది. పరబ్రహ్మము ఎక్కడ వుంటాడో, అక్కడ శబ్దం ఒకటి ఉత్పన్నమౌతుంది. "ఆయన ఒకటి", "నాదమొకటి", "ప్రణవమొకటి" కాదు సుమా! **"ప్రణవోపాసన"** చేయుట అంటే, ఉపాసన అన్న మాటకి అర్థం ఏమిటంటే, దగ్గరగా కూర్చోవటం. ఆయన ఉపాసకుడండీ అంటారు. 'ఆసన' అంటే కూర్చోవడం, 'ఉపాసన' అంటే దగ్గరగా కూర్చోవటం. అంటే, పక్కన కూర్చోవటం కాదు. **"దగ్గరగా ఆలోచన చేస్తూ ఉండడం. ప్రణవోపాసనము అంటే ఓంకారమును"** గూర్చి బహు భంగిమల ఆలోచించుట. అది అదే పనిగ ఎవరు ఆలోచిస్తారో, అలా ఆలోచించినవాడు యోగియై అదే లోకము నందు కనబడుతుంది.

"యోగరతోవా భోగరతోవా; సంగరతోవా సంగవిహీనః, యస్యబ్రహ్మణి రమతే చిత్తం, నందతి నందతి నందత్యేవ". (భజగోవింద స్తోత్రం అంతటా "ప్రణవమే". ప్రపంచ మంతట ప్రణవాకారమే అయిపోతుంది. చివరకు తానేమైపోతాడు. ప్రణవమే అయిపోతాడు. అందుకే ఆయన పేరేమిటో ఎవ్వరికీ తెలీదు. నేను వస్తూ అడిగా, ఆయన అక్కడ గట్టిగా ప్రణవం చెప్తూండేవారట, ఎప్పుడూ ప్రణవమే, నేను విన్నది ఒకసారి వైద్యశాలలో వుండి కూడా ప్రణవమే, ఎప్పుడూ ప్రణవం, ప్రణవం, ప్రణవం పలకడమే. అంతట కోకిల పలికినా, ఏది పలికినా ఆయనకు ప్రణవమే వినపడేది. ప్రణవంగా జగత్తుని చూసేవారు. అలా చూడడంవల్ల ఏమైపోయిందంటే యదార్థంగా ఆయన పేరు ఏం పెట్టారో తెలీదు. సన్యాశాశ్రమం తీసుకుంటే తల్లిదండ్రులు పెట్టిన పేరు పోయి దీక్షానామం వస్తుంది. దీక్షా నామమేమిటో తెలీదు. ఆయన పేరేమయ్యిందంటే "ఓంకార స్వామి" గారైయింది. ఆ స్థాయికి వెళ్ళారు కాబట్టే ఆయన పెట్టిన ఆశ్రమంలో ఆ శక్తి నిలబడింది కాబట్టే శత సంవత్సరములు దాటిపోయినా ఆశ్రమం అలాగే చెక్కుచెదరకుండా ఉండి భక్తులందరికీ అనుగ్రహ సందేశాలను అందిస్తూనే ఉంది. అంతటి పరమ పవిత్రమైనటువంటి స్థితిని మహానుభావులు పొందారంటే, నాదముగా, శబ్ధముగా, ఊపిరిగా, ప్రణవముగా, పరబ్రహ్మముగా ఆయన లయమైపోయి, అంతటా నిండి నిబిడీకృతమైపోయారు. అప్పుడు ఇంకా ఏదో పరిమితి అన్నమాట ఉండదు.

గది గోడని పగులకొట్టేస్తే, అంతా ఏకమైపోయినట్లుగా, ఆయన శరీరము పతనమైపోయిన తరువాత యోగి అంతటా నిండిపోతాడు. అందుకే శరీరం పతనమైపోయేవరకు "బ్రహ్మము"ను దర్శించినప్పటికీ, శరీరముతో వుంటే, "జీవన్ముక్తుడు" అంటారు. శరీరముతో ఉండి మోక్షమును పొందాడు అంటారు. అనంతమైనటువంటి ఆకాశంలా వ్యాప్తి చెందాడు. దీన్నే "మోక్షము"ను పొందాడు అంటారు. ఇటువంటి మహానుభావుడు కాకినాడ పట్టణమునకు దగ్గరలో అంత గొప్ప ఆశ్రమమును నిర్మాణం చేయడం వారి పేరుమీద సభలు జరగడం, ఆ సభలలో పాల్గొని నేను దాన్ని గురించి మాట్లాడడం, ఆయన అనుగ్రహం తప్ప వేరొకటి కాదు. కాబట్టి ఆ 'ప్రణవ'మనేటటువంటి దాని ఉపాసన చేయగా చేయగా తెలుస్తుంది తప్ప. నిజానికి దాని గురించి వివరణ చేయడం ఒక రోజులో చేసేది కాదు, రెండు రోజుల్లో చేసేది కాదు, చాలా గంభీరమైనటువంటి విశేషం కానీ స్పృశించమన్నారు కాబట్టి పెద్దలు అటువంటి ఆశ్రమానికి వచ్చి కాదనడం ఎందుకని దాన్ని గురించి స్పృశించాను. అందుకే గీతాచార్యులు ఒక మాటంటాడు. ఎక్కడో ఎవరో ఆ ఒక్క అక్షరమైనటువంటి "ఓంకారము"ను ఉపాసన చేసిన వాడు పునరావృత్తి లేని స్థితికి వెళ్లిపోతున్నాడు అని తీర్పు చెప్పాడు గీతలో అంత గొప్ప స్థితి. కాబట్టి ఈవేళ నాలుగు మాటలూ ఇక్కడ పలకడానికి మహాపురుషులవారు అనంతమైనటువంటి ఆకాశ స్వరూపులై వుండి నన్ను అనుగ్రహించినందులకు "ఓంకారస్వామి" వారి పాదారవిందములకు సాంజలిబద్ధముగ నమస్కరిస్తూ, అలాగే జ్ఞానేశ్వరీమాత గారికి కూడా నా హృదయ పూర్వకమైనటువంటి నమస్సులను ఆవిష్కరిస్తూ, అందరూ ఇంత ఓర్పుతో కూర్చొని, ఇంత ప్రేమతో విన్నందుకు మీ అందరికీ నా కృతజ్ఞతలనావిష్కరిస్తూ.... స్వస్తి.

మంగళాశాసనా పద్రైః, పదాచార్య పరోగమైః
సర్వైశ్చ పూర్వైః ఆచార్యైః, సత్కృతాయాస్తు మంగళం

మంగళం కోసలేంద్రాయ మహనీయ గుణాత్మనే
చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగళం

ఉమాకాంతాయ కాంతాయ కామితార్థ ప్రదాయినీ
శ్రీ గిరీశాయ దేవాయ బలినాధాయ మంగళం

సర్వం శ్రీ ఉమామహేశ్వర పరబ్రహ్మార్పణమస్తు !

! స్వస్తి !

సమాప్తం...

– శ్రీమతి శివకుమారి, హైదరాబాద్.



# ధ్యానము

**ఆంగ్లమూలం : స్వామి ఓంకార్** **అనువాదం : స్వామి తత్త్వవిదానంద**

## చిత్ స్వరూపమును గుర్తించి ధ్యానించిన తన్మయులగుదుము

*(గత సంచిక తరువాత...)*

మీరు శాశ్వతసత్యము మరియు అతిశయ మహిమ (పరమాత్మ) యొక్క ప్రియ సంతానము. కాని, మీరు ఇప్పుడు కాలము–దేహముల బంధములో ఉన్నారు. కావుననే, ఆ సద్రూపులై ఉండుట యొక్క అనుభూతి మీకు ఇంకా తెలియుటలేదు. కాని, ఎప్పుడైతే మహిమాన్వితమైన ఆ సద్–అనుభూతి మీకు ఆవిష్కారమౌతుందో, అప్పుడు మీరు ఆ సద్రూపులుగా ఉండే విధంగా పరివర్తన చెందుతారు. అప్పుడు ఆ స్వర్గమునందలి వారు ఏ విధమైన జ్ఞానమును మరియు అనుభూతిని పొందుతారో, మీరు కూడ అదే విధమైన జ్ఞానమును మరియు అనుభూతిని పొందుతారు. ఇప్పుడు కప్పివేయబడినదై చర్మచక్షువునకు కానరాకుండా ఉన్నప్పటికీ, అప్పుడు మీ ఆధ్యాత్మిక (జ్ఞాన) నేత్రమునకు అంతా తేటతెల్లముగా నుండును. ఇప్పుడైతే ప్రాకృతికము, ఆధ్యాత్మికమును గ్రహించలేదు. ఎందుకంటే, ఆధ్యాత్మిక స్థాయిలో ఆధ్యాత్మిక దశయందు ఆధ్యాత్మికములైన ఇంద్రియములతో ఆత్మానాత్మవివేకపూర్వకముగా సత్యమును తెలియాలి. పరిచ్ఛిన్న (అల్ప)మైన మనస్సు, మున్ముందుగా అనంతతత్త్వము యొక్క స్వభావమును మరియు సౌందర్యమును గ్రహించలేదు. కాబట్టి సత్యమును అడ్డుకుంటున్న అజ్ఞానపు పొరలు అనే గోడ తనంత తానుగా పడిపోవునట్లు చేయుడు. ఎప్పుడైతే మీకు అతిశయించిన తీవ్రమైన జిజ్ఞాస కలుగునో, అప్పుడు ఆ జిజ్ఞాస యొక్క ఆదేశముచే ఆ గోడ పడిపోవుటకు సిద్ధమగును. అప్పుడు అజ్ఞానమనే బుడగ పగిలిపోవును. ఇప్పటి వరకు ఆవరించబడిన ఆకాశము ఇప్పుడు హద్దులు లేని విస్తారములో విలీనమగును. ఇది సత్యము. ఎప్పుడైతే మీ యొక్క ఆ అల్పమైన నేను–భావన, మీ అహంకారము, మరణించినదో, లేదా కరిగిపోయినదో, లేదా విలీనమైనదో, లేదా మరోలా చెప్పాలంటే విముక్తిని పొందినదో, లేదా తన పై స్థాయికి ఎదిగినదో, అంటే తనను తాను సరిదిద్దుకుని శుద్ధమైనదో, పై తత్త్వము నందు కేంద్రీకృతమైనదో, లేదా ఊర్ధ్వముఖము చేయడినదో, అప్పుడు ఆ గొప్ప నేను, వైశ్విక పురుషుడు, పరమాత్మ లేదా మహాశూన్యము, తరంగములు లేని మహాసముద్రము, శాంతి సముద్రము, అనంతత్త్వము యొక్క ఆనంద సముద్రము మాత్రమే మిగిలియుండును.

కాని ఆగుము. మీ లోపల గాలి లేనిచో, వాతావరణ ఒత్తిడియే మిమ్ములను నలగ కొట్టివేయును. ఏ గాలి ప్రాణాలను నిలబెడుతూందో, అదే గాలి ఒక క్షణములో ప్రాణములను

తీయును. ఇదే విధముగా, మీ లోపల (స్వరూపమునందు) ఆద్యంతరహితమగు పరమాత్మ లేనిచో, ఆ పరమాత్మ మీరే కానిచో, మీరు కేవలము అహంకారము మాత్రమే అయి విశ్వాత్మ కానిచో, మీ మూలాలు కదిలిపోతాయి. ఆ శూన్యము యొక్క స్వాతంత్ర్యము, ఆ విస్తారము యొక్క అతిశయము మీపై అఘాతమును వేసి, మిమ్ము నలిపివేయుటకు సమయము పట్టదు. మీరు అతిసరళముగా నురగవలె ఒడ్డు మీదకు విసిరి వేయబడెదరు. ఎందుకంటే, మీ లోపల ఉన్న పరిపూర్ణత్వము యొక్క సామ్రాజ్యమును, అనంతమైన శాంతిని, మరియు ఆనందమును వారసత్వముగా పొందేది రక్తమాంసాలు కావు. అల్పమైన శరీరస్పృహ యొక్క సంతానము అయోగ్యమైనది గావున ఆనంద సామ్రాజ్యమునకు అర్హము కాదని త్రోసివేయబడును. ఇట్టివారికి దానియందు తావు లేదు, వారసత్వము లేదు. మీరు మీ అహంకారమనే ఆల్చిప్పను, దేహమనే గూడును, ఆద్యంతరహిత పరమాత్మ అనే సముద్రములోనికి తీసుకుపోలేరు. మీరు ఆ అహంకారము నుండి బయటకు వచ్చి, విశాలమైన జీవన సముద్రము యొక్క అంతర్భాగము కావలసి ఉంటుంది. మీ సంకుచితమైన, భద్రత కోసం ప్రాకులాడే జీవనతరంగము ఒడ్డుకు మాత్రమే తగినది[1]. మీ బిందువు సింధువు (సముద్రము) నందు విలీనమగును గాక! మీరు జీవనసముద్రమునకు, ఆనందఘనమునకు, ఆద్యంతములు లేని తత్త్వము యొక్క స్వాతంత్ర్యమునకు చెందిన గగుర్పాటును కలిగించే ఆనందమును, అనుభూతికి తెచ్చుకొనుడు.

ఓ! అనంతశూన్యమా[2]! ఆంతరమునందలి ఏకాంతమా!
నీ సొగసులు ఋషులను ఇంకా మురిపిస్తూనే ఉన్నాయి!!

మీరు ఎప్పుడైతే అతిశయి మహిమాన్వితమైన ఆత్మ చైతన్యము యొక్క జాజ్వల్యమాన ప్రకాశము నందు నిలిచి ఉంటారో, అప్పుడు మీరు దేహము నందు ఉన్నారా, లేక దేహమును విడిచి ఉన్నారా అనే విషయమునకు ప్రాముఖ్యము ఏమీ ఉండదు. ఎందుకంటే, ఆ మహిమ భౌతికపదార్థ సముదాయమునంతనూ వ్యాపించి విస్తరించి నిండియున్నది. ఆ ఆత్మ చైతన్యము యొక్క వెలుగు ముందు దేనినైననూ దాచిపెట్టుట గాని, కప్పి ఉంచుట గాని సంభవము కాదు. ఆ వెలుగు సర్వమును లోతుగా ప్రవేశించి సర్వమును మార్చి వేస్తుంది. ఆ అనంత సత్యము గాలులను తన రథములుగా చేసుకుంటుంది. ఆ సత్యము మేఘములు మరియు తరంగములపై స్వారీ చేస్తుంది. మిన్ను సింహాసనము కాగా, ఆ పరమాత్మ తన పాదములను భూమిపై మరియు సముద్రముపై నిలిపినాడు. స్వర్గములు ఆ పరమాత్మ యొక్క మహిమను గంభీరమైన ధ్వనుల ద్వారా ప్రకటిస్తూ స్తుతిస్తున్నాయి[3]. అంబరమే ఆ పరమాత్మకు వస్త్రము

*1 విశాలమైన సముద్రమునందు అంతర్భాగమగుటకు యోగ్యము కాదు.

*2 నిర్గుణ పరబ్రహ్మను స్వామి ఓంకార్ కొన్ని సందర్భాలలో శూన్యము అని పిలిచినారు, అంటే ఆకాశము వలె, శూన్యమును పోలినది అని భావము.

*3 మేఘగర్జనలు అని స్వామీజీ అభిప్రాయం కావచ్చును.



కాగా, ప్రకృతి ఆయనకు ఆభూషణమగుచున్నది. అగ్ని ఆ పరమాత్మకు ముందు మండుతూ పరమాత్మను ప్రవేశపెడ్తోంది[1]. సర్వము ఆ పరమాత్మ యొక్క మహోదారమైన చలనచిత్రము మరియు అభివ్యక్తి. సర్వము ఆ పరమాత్మకు సాధనము మరియు పనిముట్టు. ఆయనకు పనికి రానిది గాని, అయోగ్యమైనది గాని, అవరోధము గాని, ఆయన నియంత్రించలేనిది గాని, ఏదీ లేదు. మీరు ఈ ఎత్తుకు ఎదగండి, ఈ దర్శనములో భాగస్వాములు కండు, తద్వారా మీరు విముక్తులు కండు, ఆ పైన మీరు శాశ్వతకాలము దేహము నందు గాని, ప్రపంచము నందు గాని ఉన్ననూ, అది సమస్యయే కాదు. ఎందుకంటే, వాటియందు ఉంటూనే వాటి లేపము లేకుండా ఉండుట మీకు తెలుస్తుంది. శాశ్వతమైన సత్యము నందు నిష్ఠ గలవారై స్థిరముగా, స్వగృహమునందు వలె, నిలిచియుండుట మీకు తెలుస్తుంది. దేహమును, ప్రపంచములోని వస్తువులను ఆత్మయొక్క మరియు శాశ్వత సత్యము యొక్క పనిముట్లుగా మార్చివేయడం మీకు తెలుస్తుంది.

మన జన్మహక్కు ఇట్టిది. మనము పరమాత్మ యొక్క విభూతికి వారసులము. మనకు ఆ పరమాత్మతో గల అభేదము సాక్షాత్కరించినప్పుడు, అంతే కాదు, ఆ పరమసత్యము నేను ఒక్కటే అనే దర్శనములోనికి మనము మేల్కాంచినప్పుడు, ధ్యానము ధ్యానమే కాదు. ఆ పైన సంకల్పములకు అభ్యాసము అక్కరలేదు. మీరు మనస్సును కూడ ఏకాగ్రము చేయనక్కరలేదు. ఆందోళనను కలిగించే సమస్యల యొక్క గాలివాన చెలరేగి మీ శాంతి స్వరూపము అనే ప్రశాంతమైన సముద్రమును కలచివేసే పరిస్థితి ఉండదు. మీరు ఏకాంతమునందు జీవిస్తూ ఉండగా, కలవరపరచే కర్తవ్యములు మరియు బాధ్యతల బాకా శబ్దములు మీ గుమ్మం ముందు వినబడవు.

భోగలాలసత అంతా మోసమే. అది కంటికి కానరాకుండా సర్వమును మ్రింగివేసే పాము. అది స్వర్గసుఖవాంఛకు ప్రతిరూపమైనది. భౌతికము, స్థూలము, నకిలీది, తుచ్ఛమైనది. నీవు ఇంద్రియములను జయించినవాడవు గనుక, ఆ భోగలాలసత అనే సర్పము దాగి ఉండి తన పడగలను నీపై ప్రసరింపజేయుట సంభవము కాదు. ఆసనబద్ధుడవై ధ్యానము చేసే నీపై అది బుస కొట్టలేదు. ఇప్పుడు సర్వముపై, సర్వపరిస్థితులపై నీకు ఆధిపత్యము గలదు. నీవు సర్పమును జయించి, వశపరచుకొని, ఆ సర్పముపై నాట్యము చేసెదవు[2]. అప్పుడు ఆ సర్పము నీకు వినయవిధేయతలు కలిగి చెప్పిన పనిని ప్రేమతో చేసే నౌకరు వంటిది అగును. నీవు నీ సామ్రాజ్యమును నిర్ధారించి దానిపై ఆధిపత్యమును చెలాయిస్తావు. యథార్థముగా భగవంతుని సామ్రాజ్యము నీ లోపలనే ఉన్నది! మృగరాజు అగు సింహము గర్జిస్తూ భయమును కలిగిస్తూంటే, ఇతర మృగములన్నీ భయభీతములై అడవిలో నిశ్శబ్దముగా నక్కి ఉంటాయి.

*1 అగ్నికీలలు పరమాత్మకు సార్వభౌమునకువలె పతాకలు అని స్వామీజీ అభిప్రాయము కావచ్చును.

*2 స్వామీజీ ఈ సందర్భములో భోగలాలసతను కాళియునితో, ఇంద్రియజయము గల సాధకుని సాక్షాత్తు శ్రీకృష్ణభగవానునితో పోలుస్తున్నారు. అయితే, ఈ పోలిక వాచ్యము కాదు, ధ్వని మాత్రము.

ఇప్పుడు భగవానుడు తన శాంతి సింహాసనమును అధిష్టించి ఉన్నాడు! కాబట్టి సకలము వినయ విధేయలతో, ఆదరభావముతో శాంతములై ఉండి, ఆ భగవానుని ఆదేశములను పాటించు గాక! ఓమ్!

ఇప్పుడు చెప్పండి, ఈ పరిస్థితిలో ధ్యానమునకు ఆవశ్యకత ఏమి ఉన్నది? ధ్యానము ద్వారా మనము సాధించగోరేది ఇంకా ఏమి మిగిలి ఉన్నది? ఏమీ లేదు, సుతరాము ఏమీ లేదు. కాబట్టి మనము సర్వదా మనము ఏదియో అదియే అయి ఉందాము. బుద్ధిపూర్వకముగా, ఉత్సాహపూర్వకముగా మరియు నిరంతరముగా అదియే అయి ఉందాము. దైవీ సత్తయొక్క మహిమాన్వితమైన సిద్ధాంతము సత్ (ఉనికి) మరియు ఆనందము. అదియే శాశ్వతమైన ఆనందఘనమైన సత్త. కాబట్టి, మనము మన ఈ దేహము యొక్క పుట్టుక అనే భావనను సైతము విస్మరిద్దాము. ఈ దేహమును కూడా విస్మరిద్దాము. మనము నిరంతరముగా మన దైవత్వమును అనుభూతికి తెచ్చుకుందాము. మనము దైవీ సత్త అనే స్వరూపమునందు నిరంతరముగా నిలిచి ఉండని మరియు అనుభూతికి తెచ్చుకోని క్షణమైననూ ఒక్క శ్వాసయైననూ ఉండకుండు గాక !

అంతిమముగా, మిమ్ములను పూర్తిగా నిరుత్సాహపరచుట నాకు సమ్మతము కాదు. మీరు ఆత్మమంత్రము (ఆత్మను సాక్షాత్కరింపజేసే ఫార్ములా, అంటే సూత్రము)ను పిచ్చి ప్రేమతో నానుండి ఆపేక్షించి ఉన్నట్లయితే, మీ దృష్టిని దాని నుండి ఇంకోవైపుకు త్రిప్పే ప్రయత్నమును నేను మీ అనుమతి లేకుండా చేసినాను. ఇప్పుడు[1] మీరు అట్టి ఫార్ములాను పూర్తిగా త్రోసిపుచ్చుటకు తగినంత కారణము[2] గలదు. కావున, మీరు నానుండి ఈ చిట్కాను గ్రహించి, మీరు స్వయముగా సాధన చేయుడు. ఆత్మసాక్షాత్కార-ఫార్ములా యొక్క ఉపదేశము మరియు తాయొత్తు రెండు కలిపి ఇదియే (ఆత్మనిష్ఠయే). ఇది ఇట్లు ఉండును. దీనిని మీరు మనస్సులో అనుసంధానము చేయుడు. ఓమ్! నేను సచ్చిదానంద స్వరూపుడను! నేను అఖండసద్రూపుడను! నేను అఖండచిద్రూపుడను! నేను అఖండ-ఆనందస్వరూపుడను! నేను సర్వమునందు సర్వమునై ఉన్నాను! చూడబడినది మరియు చూడబడనిది సర్వము యథార్థముగా నేనే! భూతభవిష్యద్వర్తమానములు నేనే! నాకంటె వ్యతిరిక్తముగా ఏదీ లేదు!

ఆ తరువాత మిమ్ములను మీరు ఇట్లు ప్రశ్నించుకొనుడు. సత్యము అట్లు ఉండగా, నేను ఒక స్థానమునకు, లేదా ఆసనమునకు పరిమితమై ఉండగల్గుతానా? నేను అంతటా లేనా? ఉదాహరణకు, నేను కేవలము ఈ నా చిన్ని కన్నులతో మాత్రమే చూస్తున్నానా?

అప్పుడు మీకు మీరే ఇట్లు సమాధానమును చెప్పుకొనుడు. నేను ఈ నా కన్నులలో ఉన్నట్లైతే, నేను మిగిలిన కన్నులన్నింటియందు కూడా ఉండి తీరాలి! నేను ఈ చెవులలో ఉన్నట్లయితే, చెవులన్నింటియందు ఉండి తీరాలి! నేను ఈచేతులలో ఉన్నట్లయితే, నేను చేతులన్నింటియందు ఉండి తీరాలి! నేను ఈ కాళ్లయందు ఉన్నట్లయితే, నేను కాళ్లు అన్నింటియందు ఉండి తీరాలి! ఇత్యాది.

*1 నా విస్తృతమైన వివరణను విన్న తరువాత అని అభిప్రాయము.
*2 మీరు సర్వదా ఆత్మస్వరూపులై ఉండుటయే.



మరల ఇట్లు సంకల్పించుడు. సర్వము నేను అయి ఉండగా, నా కంటె భిన్నముగా ఉన్నది యెవరు? నన్ను ఒక విశిష్టమైన నామరూపములకు పరిమితము చేసే ఇతర వ్యక్తి యెవరు ఉన్నారు? అట్టి ఇతర వ్యక్తి ఉన్నట్లయితే, ఆ విధముగా అతనియందు మరియు అతని ద్వారా చేస్తున్నది నేనే కాదా? అతడు సంకల్పించినట్లయితే, నేను అతని లోపల సంకల్పిస్తున్నాను! అతని గుండె కొట్టుకుంటున్నట్లయితే, నేను ఆ గుండె యందు కొట్టుకుంటున్నాను! అతడు గాలి పీలుస్తూంటే, అతనియందు నేను గాలి పీలుస్తున్నాను! అన్ని సంకల్పములయందు, అన్ని మనస్సుల యందు నేనే సంకల్పిస్తున్నాను! శ్వాసకోశములన్నింటియందు నేనే గాలి పీలుస్తున్నాను! గుండెలన్నింటి యందు నేనే స్పందిస్తున్నాను! సర్వము నందు సర్వము నేనే! బ్రహ్మాండము నేనే! అఖండసత్యము నేనే!

అంతిమంగా ఇట్లు తలపోయుము. సకలసత్త యొక్క సత్, అంతిమనిధానము, మూలస్రోతస్సు కూడ నేనే! సర్వము నానుండియే ఆవిర్భవించి, నాయందే మనుగడ గలదియై, నాయందే విలీనమగుచున్నది !.

*(సశేషం...)*

**శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి !**

- శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.
- సం॥ర చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే). M.O. ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.
- M.O. ఫారంలో దిగువ For Communication భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.
- చందా కాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొంటే మంచిది.
- అడ్రసు మార్పును ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి.
- చందా వివరములు తెలుపని యెడల సొమ్మును విరాళముగా జమ చేయబడును.

**కార్యదర్శి, శాంతి ఆశ్రమం (PO)**
వయా శంఖవరం-533 446, తూ॥గో॥ జిల్లా.

# శ్రీ కృష్ణభక్తి ప్రధానమైన వ్రతము

## భక్తి లేని పూజ నిరుపయోగము

*(గత సంచిక తరువాత...)*

**(శ్రీ బ్రహ్మ వైవర్త మహాపురాణము, తృతీయ ఖండము-ఏకతింశత్తయోధ్యాయః పరశురామ శ్రీకృష్ణ కవచ ప్రదానము)**

## వ్రతకథ

కుశధ్వజుని కూతురు వేదవతి పుష్కర క్షేత్రములో ఈ వ్రతమాచరించెను. వ్రతసమాప్తి నాడు పరమేశ్వరియైన జగదంబిక కోటి సూర్యకాంతులతో, కనకరధముపై లక్ష సంఖ్యగల యోగినులతో కొలువుదీరి వేదవతికి సాక్షాత్కరించి, చిరునవ్వుతో ప్రసన్నముగా ఇట్లనెను. "నీకిష్టమైన వరమును కోరుకొనుము. నీ వ్రతముచేత నేను సంతుష్టురాలనైతిని". వేదవతి దోసిలి జోడించి నమస్కరించి "దేవీ! నేను మనస్సులో సంకల్పించుకొన్నట్లు శ్రీమన్నారాయణుడే నాకు కాంతుడగునట్లు వరమిమ్మనెను. జగదంబిక రధము దిగి ఆ హరిప్రియతో" నీవు స్వయముగా లక్ష్మీసాధ్వివి. భారత వర్షమును నీ పాదధూళితో పవిత్రము చేయుటకు వచ్చితివి. ఈ వ్రతము లోకులకిట్లు చేయవలెనని తెలియచెప్పుటకై ఈ తపమాచరించితివి. నారాయణుడు పూర్ణరూపుడై దశరధ రాముడై దుష్టులను అణచివేయుటకు, బ్రాహ్మణుల శాపము వలన భూమి మీద బడిన తన భక్తుల (జయవిజయములను ద్వారపాలకులు)ను శాప విముక్తులను చేయుటకు త్రేతాయుగములో అయోధ్యలో అవతరించును. అయోని సంభవయైన నిన్ను జనకుడు బిడ్డగా పొంది, శ్రద్ధతో పాలించును. నీవు సీతానామము ధరింతువు. రాముడు మిథిలను చేరి నిన్ను వివాహమాడును. ప్రతికల్పములో నీవు నారాయణుని పత్నివగుదువు". అని తన స్థానమునకేగెను.

వేదవతి తన మాయాశక్తితో మిధిల చేరి శిశు రూపములో నాగలి చాలులో నిలిచెను. జనకుడు కరిగిన బంగారు వన్నెతో గొప్ప తేజస్సుతో కూడిన ఆ శిశువును ఎత్తుకొనెను. ఆకాశవాణి అయోనిసంభవయైన ఈ శిశువు లక్ష్మీ ఈమెను గ్రహించి పోషించుము. నారాయణుడే నీ అల్లుడగును అని పలికెను. ఆ సీత ధరశధపుత్రుడైన రాముని భర్తగా పొందెను. ఈ వ్రత ప్రభావము వలన ముల్లోకములకు ప్రభువైన స్వామిని కాంతునిగా పొందెను. ఈ విషయమును వశిష్ఠ మహర్షి భక్తితో ఈ లోకమున ప్రకటించెను.



మాసము దినములు గోపికలు పైన చెప్పిన నియమము ప్రకారము గౌరీ వ్రతమాచరించి, వ్రత సమాప్తి దినమునాడు కణ్వశాఖలో చెప్పబడిన ప్రకారముగా, సీతాదేవి ఏ స్తోత్రము స్తుతించి రామచంద్రుని భర్తగా పొందినది అదే స్తోత్రముతో పరమేశ్వరిని స్తుతించిరి.

**శక్తి స్వరూపే సర్వేషాం సర్వాధారీగుణాశ్రయే ।**
**సదాశంకరయుక్తే చపతిం దేహి నమోస్తుతే ॥**
**దృష్టిస్థిత్యంత రూపేణ సృష్టి స్థిత్యంత రూపిణీ ।**
**సృష్టిస్థిత్యంత బీజానాం బీజరూపే నమోస్తుతే ॥**
**మే గౌరీ పతిమర్మజ్ఞే పతివ్రత పరాయణే ।**
**పతివ్రతే పతిరతే పతిందేహి నమోస్తుతే ॥**
**సర్వమంగళ మాంగల్యే సర్వమంగళ సరియుతే ।**
**సర్వమంగళ బీజేచ సమస్త సర్వమంగలే ॥**
**సర్వప్రియే సర్వబీజే సర్వాశుభ వినాశిని ।**
**సర్వేశే సర్వజనకే నమస్తే శంకర ప్రియే ॥**
**పరమాత్మ స్వరూపే చ నిత్యరూపే సనాతని ।**
**సాకారేచ నారాకారే సర్వరూపే నమోస్తుతే ॥**
**క్షుత్తృష్టేచ్ఛా దయాశ్రద్ధా నిద్రా తంద్రా స్మృతిః క్షమా ।**
**ఏకాస్త వకలాః సర్వానారాయణి నమోస్తుతే ॥**
**లజ్ఞామేధా తుష్టి పుష్ఠీ శాంతి సంపత్తి వృద్ధయః ।**
**ఏతాస్తవ కలాః సర్వాః సర్వరూపే నమోస్తుతే ॥**
**దృష్టా దృష్ట స్వరూపేచ తమోర్బీజ ఫలప్రదే ।**
**సర్వా నిర్వచనీయేచ మహామాయే నమోస్తుతే ॥**
**శివే శంకర సౌభాగ్యయుక్తే సౌభాగ్య దాయిని ।**
**హరిం కాంతంచ సౌభాగ్యం దేహిదేవి నమోస్తుతే ॥**

అందరు జీవులకు శక్తి స్వరూపములో నుండి అందరికాధారమైనదానా! శుభ గుణములకు ఆశ్రయమైనదానా! ఎల్లప్పుడు శంకరుని కూడియుండుదానా! నాకు పతినిమ్ము. నీకు నమస్కారము. సృష్టిస్థితిలయములొనర్చునట్టి బ్రహ్మవిష్ణురుద్ర రూపములు ధరించుదానా! సృష్టిస్థితిలయములకు మూలకారణమైన వాటికి బీజమువంటిదానా! నీకు నమస్కారము. ఓ గౌరీదేవీ! పతిరహస్యమెరిగినదానా! పతిని వ్రతనిష్టతో భజించుయందాసక్తిగల దానా! ఓ పతివ్రతా! పతియందు ధృఢాసక్తిగలదానా! నీకు నమస్సులు. నాకు పతినిమ్ము! జీవుల సర్వ

మంగళములకు బీజభూతురాలా ఓ సర్వమంగళా! నీకు నమస్కారము. సర్వప్రాణులకు ప్రియమైనదానా! సర్వమంగళ గుణములకలదానా! లోకమున సర్వమంగళములచేత మంగళ భూతురాలా! ఓ సర్వమంగళా! నీకు నమస్కారము. సర్వప్రాణులకు ప్రియమైనదానా! సర్వ శక్తులకు బీజనమైనదానా! సర్వవిధములైన అశుభములను నశింపజేయుదానా! సర్వమునకు ఈశ్వరీ! సర్వమును సృష్టించుదానా! ఓ సనాతనీ! ఓ నిత్యరూపిణీ! సాకార నిరాకార రూపముల న్నియు నీవే ఐనదానా! నీకు నమస్కారము. ఓ నారాయణీ! ఆకలి, దప్పి, కోరిక, దయ, శ్రద్ధ, నిద్ర, సోమరితనము, స్మృతి, క్షమ అవి అన్నియు నీ అంశలే. నీకు నమస్కారము. లజ్జ, మేధ, తుష్టి, పుష్టిలు, శాంతి, సంపద, అభివృద్ధి ఇవి అన్నియూ నీ కళలే. సర్వరూపిణీ! నీకు నమస్కారము. కన్నులకు కన్పించునట్టి మరియు కన్పించనట్టి స్వరూపములుగలదానా! ఆ రెండు రకముల స్వరూపములకు బీజమును, ఫలమును ఇచ్చుదానా! సర్వవిధముల నిర్వచింప రాని మహామాయా నీకు నమస్కారము. ఓ శివా! శంకరుడను సౌభాగ్యము కలదానా! సౌభాగ్యము నిచ్చుదానా! నాకు సౌభాగ్యమును మరియు శ్రీహరిని భర్తగాను ప్రసాదించుము. నీకు నమస్కారము.

ఈ స్తోత్రములో పార్వతిదేవిని వ్రత సమాప్తి దినమున ఏ కన్యలు స్తుతించి గొప్ప భక్తితో నమస్కరింతురో వారు శ్రీహరినే భర్తగా పొంది, దివ్య రథమునెక్కి శ్రీకృష్ణ సన్నిధికి ఏగుదురు. బ్రాహ్మణులకు వేయి గోదానములు చేసి, వ్రతము చేయించిన పురోహిత బ్రాహ్మణునకు నూరు బంగారు నాణెములను దక్షిణగా ఇచ్చెను. ఆదరముతో వేయిమంది బ్రాహ్మణులకూ భోజనము పెట్టి, భిక్షకులకు ధనము దానమొనర్చెను. తరువాత స్వగృహమునకు ప్రయాణం అయ్యిరి. ఇంతలో దుర్గాదేవి బ్రహ్మతేజస్సుతో ప్రత్యక్షం అయినది. రాధాదేవి, గోప కన్యలు నమస్కరించగా నీ వాంఛ సిద్ధించును అని ఆశీర్వదించి రాధాదేవితో ఈ విధముగా పల్కెను.

**పరాత్పరో గుణాతీతో బ్రహ్మాదీనాం చ వందతః।**
**స్వయం కృష్ణస్తనాధినో మద్వరేణ భవిష్యతి॥**
**బ్రహ్మానంత శివారాధ్యో భవితా త్వద్వశః పతి ।**
**ధ్యానాసాధ్యో దురారాధ్యః సర్వేషామపి యోగినాం ॥**
**త్వం చ భాగ్యవతీ రాధే స్త్రీ జాతిషు న తే పరా ।**
**కృష్ణేన సార్ధం పశ్చాత్త్వం గోలోకం చ గమిష్యసి ॥**
**ఇత్యుక్త్వా పార్వతీ సద్యస్తత్రైవాంతర్దధే మునే ।**
**సార్ధం గోపాలికాభిశ్చ రాధికా గంతుముద్యతా ॥**

త్రిగుణాతీతుడు బ్రహ్మాదుల చేత నమస్కరింపబడువాడు పరాత్పరుడు ఐన శ్రీకృష్ణుడు



నా వరము వలన తానే స్వయముగా నీకధీనుగడును. ధ్యానము చేత సాధింపరాని వాడును ఆరాధించుటకు కష్టసాధ్యుడును (సర్వయోగులకు), బ్రహ్మ, అనంత, శివులచేత ఆరాధింప బడువాడును అగు హరి నీవశమగును. రాధా! నీవు మిక్కిలి భాగ్యవంతురాలివి. స్త్రీ జాతిలో నీకంటే శ్రేష్ఠురాలు లేదు. ఈ జన్మ తరువాత శ్రీకృష్ణునితో బాటు నీవు గోలోకమునకు పోగలవు. ఇట్లు పలికిన పార్వతీదేవి వెంటనే అక్కడ అంతర్ధానమయ్యెను. రాధాదేవి గోపికలతో బాటు గృహమునకేగ పూనుకొనును.

**ఏతస్మిన్నంతరే కృష్ణో జగామ రాధికాపురం ।**
**రాధా దదర్శ శ్రీకృష్ణం కిశోరశ్యామ సుందరం ॥**
**పీతవస్త్ర పరీధానం నానాలంకార భూషితం ।**
**ఆజాను మాలతీమాలా వనమాలా విభూషితం ॥**
**ఈషద్ధాస్య ప్రసన్నాస్యం భక్తానుగ్రహకాతరం ।**
**చందనోక్షిత సర్వాంగం శరత్పంకజ లోచనం ॥**
**శరత్పార్వణ చంద్రాస్యం సద్రత్న ముకుటోజ్వలం ।**
**పక్వదాడిమ బీజాభ దశనం మమనోహరం ॥**
**వినోదమురలీ హస్తన్యస్త లీలా సరోరుహం ।**
**కోటి కందర్ప లావణ్యం లీలాధామ మనోహరం ॥**
**గుణాతీతం స్తూయమానం బ్రహ్మానంత శివాదిభిః ।**
**బ్రహ్మ స్వరూపం బ్రహ్మణ్యం శ్రుతిభిశ్చానిరూపితం ॥**
**అవ్యక్తమక్షరావ్యక్తం జ్యోతిరూపం సనాతనం ।**
**మాంగల్యం మంగలాధారం మంగలం మంగల ప్రదం ॥**

ఇంతలో రాధాదేవి ముందకు శ్రీకృష్ణుడు విచ్చేసెను (ప్రత్యక్షమయ్యెను) అతడు బాల రూపములోనున్న శ్యామసుందరమైన మూర్తి. ఆ వర్ణమునకు తగినట్లు పసుపుపచ్చ వస్త్రమును ధరించి నానావిధ భూషణములలంకరించుకొని యుండెను. మోకాళ్ల వరకున్న మాలతీ పుష్పమాలను "వనమాల"యను దానిని ధరించి ఉండెను. సర్వాంగమున చందనము పులుము కొని శరత్కాల పద్మములవంటి లోచనములతో (కన్నులు) మందహాసము (చిరునవ్వు)తో ప్రసన్నముగానున్న ముఖముతో భక్తులననుగ్రహించవలెనన్న తొందరతో శరదృతువులోని పున్నమి నాటి చంద్రుని వంటి ముఖమండలముపైన రత్నకిరీటకాంతితో అతడు ప్రకాశించు చుండెను. పండిన దానిమ్మ పండులోని విత్తులవంటి వన్నెగల పలువరుసతో మిక్కిలి మనో హరముగా నుండెను. వినోదముగా మురళిని, విలాసముగా పద్మమును హస్తములందు ధరించి యుండెను. కోటి మన్మథుల లావణ్యము (శరీరమందలి తళుకు) గలిగి మనోహరమైన లీలలకు

నివాసస్థానమైన ఆ స్వామిని రాధాదేవి దర్శించెను. (ఇంతవరకు కన్నులకు ప్రత్యక్షమైన ఆకారము వర్ణించబడినది. ఇక పరమాత్మ యొక్క మహిమ వర్ణించబడుచున్నది) ఆ స్వామి త్రిగుణముల కతీతుడు. బ్రహ్మ అనంతుడు శివుడు మొదలగు మహాజ్ఞానులచేత స్తుతింపబడువాడు. దృశ్యా దృశ్యమైన సర్వప్రపంచము తన స్వరూపమైనవాడు. వేదములచేత గూడ ఇట్లని నిరూపింప బడజాలని బ్రహ్మణ్య మూర్తి. నామరూపములచేత వ్యక్తము కానివాడు. అక్షర (నాశములేని) మైన అవ్యక్త స్వరూపుడు. సనాతనుడైన జ్యోతిరూపుడు. మంగళములకు కారణమైనవాడు. ఆధారమైనవాడు. మంగళప్రదుడైన "మంగళ" నాముడు. ఆ అద్భుతమైన రూపమును చూచి సంభ్రమము (భయము త్వర ఆదరముగల మానసిక స్థితి)తో అతనికి నమస్కరించెను.

**శ్రీకృష్ణ ఉవాచ - శ్రీకృష్ణుడిట్లనెను :**

**ప్రాణాధికే రాధికే త్వం వరం వృణు మనీషితం ।**
**భోభో గోపాలికాస్సర్వా వరం వృణుత వాంఛితం ॥**
**కృష్ణస్య వచనం శ్రుత్వా వరం వవ్రే చ రాధికా ।**
**గోపాలికాః ప్రహృష్టాశ్చ సర్వసంకల్ప పాదపాత్ ॥**

నా ప్రాణములకంటె అధిక ప్రియమైన రాధా! కోరుకున్న వరమునడుగుము. ఓ గోపికలారా! మీరందరును కోరిన వరమునడుగుడు (ఇచ్చెదను) కృష్ణుని మాట విని రాధా దేవియు, మిక్కిలి సంతసించిన గోపికలను సర్వవిధముల కోరికలు తీర్చు ఆ కల్పవృక్ష స్వరూపుని నుండి ఇది కావలెనని వరమును వరించిరి (కోరిరి).

**రాధికోవాచ - రాధాదేవి ఇట్లనెను :**

**త్వత్పాదాబ్జే మన్మనోలిః సతతం భ్రమతు ప్రభో ।**
**పాతుం భక్తిరసం పద్మే మధువశ్చ యథా మధు ॥**
**మదీయ ప్రాణనాథస్త్వం భవ జన్మని జన్మని ।**
**త్వదీయ చరణాంభోజే దేహి భక్తిం సుదుర్లభాం ॥**
**తన స్మృతౌ గుణే చిత్తం స్వప్నే జ్ఞానే దివావిశం ।**
**భవేన్నిమగ్నం సతతమేతన్మను మనీషితం ॥**

"ప్రభూ! నీ పాదపద్మము నందు నా మనస్సను తుమ్మెద ఎప్పుడును తిరుగుచుండును గాక. పద్మమందలి తేనెను త్రాగు తుమ్మెదవలె అది భక్తిరసమును పానము చేయుగాక. నాకు జన్మజన్మకు నీవే ప్రాణనాధుడవు కమ్ము. మిక్కిలి దుర్లభమైన నీ పాద పద్మభక్తిని నాకిమ్ము. స్వప్నములో మెలకువలో రాత్రింబగళ్లు నా మనస్సు నీ స్మృతియందు నీ కల్యాణ గుణముల యందు ఎల్లప్పుడు నిమగ్నమై ఉండుగాక. ఇదియే నేను తలచుకొన్న కోరిక".



**గోపాలికా ఊచుః - గోపాలికలిట్లు పలికిరి :**

**యథా రాధాం తథా నశ్చ ప్రాణబంధో దివానిశం ।**
**భవిష్యసి ప్రాణనాథః పాన్యసి ప్రతిజన్మని ॥**

ఓ ప్రాణబంధూ! ప్రతిజన్మయందును రాధాదేవినివలెనే మమ్ము గూడ రేబవళ్లు కాపాడుము. ప్రాణనాధుడవగుము. శ్రీ కృష్ణుని భర్తగా రాధాదేవి, గోపికలు పొందారు అంటే?

**గతిర్భర్తా ప్రభుః సాక్షీ నివాసః శరణం సుహృత్** (భ.గీ. 1×18)

పై శ్లోకములో అన్నట్లు పరమగతియైన, పరంధాముడైన, జగత్తుని భరించి పోషించే వాడు, అందరికీ స్వామి అయినవాడు, అందరి శుభాశుభములను చూచెడివాడు అయిన పరమాత్మను శరణు పొందినట్లయితే, **"యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ"** ఏ స్థానాన్ని చేరుకుంటే తిరిగి రారో, ఆ స్థానాన్ని రాధాదేవి, గోపికలు పొందారు. ఈ శ్రీకృష్ణ భక్తి ప్రధాన వ్రతము (సత్యం పరం ధీమహి) చేసినట్లయతే శాశ్వత తత్త్వమైన పరమశాంతిని, ఆనందాన్ని పొందగలము. శ్రీకృష్ణుడు మన సాధనా మార్గమును సుగమ్యం చేయుగాక !

**జై రాధే గోవిందా !**

**(సమాప్తం...)**


**1. మాతృ ఆశ్రమం**
శాంతి ఆశ్రమము
తోటపల్లి కొండలు, పిన్ : 533446
వయా శంఖవరం, తూ॥గో॥ జిల్లా
ఫోన్ : 7382009962
**e-mail : srisanthiashram@gmail.com**

**2. విశాఖ శాఖ : శాంతి ఆశ్రమము**
లాసన్స్‌బే, పెదవాల్తేరు - 530 017
విశాఖపట్నం, ఫోన్ : 0891-2538689
**e-mail : srisanthiashramvsp @gmail.com**

**3. విశ్వశాంతి క్షేత్రం**
కైలాసగిరి,
విశాఖపట్నం

**4. కోటగిరి శాఖ**
పీస్ సెంటర్,
డార్‌మోనా రోడ్, కోటగిరి-643217
నీలగిరి జిల్లా, తమిళనాడు
ఫోన్ : 04266-271945
**e-mail : vsvmsktg@yahoo.in**
**vsvmsktg@gmail.com**

**5. కాకినాడ శాఖ**
శాంతి ఆశ్రమము, అశోక్ నగర్,
కాకినాడ-533 004,
తూ॥గో॥ జిల్లా.

**6. పిఠాపురం శాఖ**
స్టువర్టుపేట,
పిఠాపురం - 533 450.

**website : www.srisantiashram.org.in**

# శ్రీరామ గీత

**- వినతి**

## జ్ఞానాన్ని పొందాలి అంటే ధర్మాన్ని అనుసరించాలి

వాల్మీకి రామాయణంలో రాముడు మానవుడు ఎలా జీవించాలి అని జీవించి చూపాడు. 11000 సం॥ రాజ్యాన్ని కూడా పరిపాలించారు. రామచరితమానస్‌లో సతీదేవి పరమశివుడిని అడుగుతుంది. నిరంతరం మహాదేవుడు రాముడ్ని ధ్యానిస్తున్నారు కానీ, రాముడు సీత కోసం సాధారణ మానవుడిగా ఎందుకు విలపిస్తున్నారు? అందుకు పరమశివుడు శ్రీరాముని మాయా తత్వాన్ని నీవు గ్రహించలేవు, ఆయన అవ్యయమైన పరమాత్మ. కావాలంటే నీవు వెళ్ళి పరీక్ష చేసుకో అంటాడు పరమశివుడు. అప్పుడు సతీదేవి సీతమ్మవారి రూపంలో రాముడ్ని సమీపించినదట. అప్పుడు రాముడు పరమశివుడు ఎక్కడ అని ప్రశ్నించాడట. సతీదేవి ఆందోళనకు గురి అయ్యి వెనక్కి తిరిగి వస్తుంటే సీత, రాములు మునీంద్రులందర్నీ సేవించుట కనిపిస్తోంది. అప్పుడు ఒక చెట్టు క్రింద ధ్యాన నిమగ్నం అయిన సతీదేవికి ఆ దృశ్యాలన్నీ అదృశ్యం అయ్యి, కళ్ళు తెరిచి చూచేసరికి కైలాసం చేరి వున్నదట. అప్పుడు మహాదేవుడు చూచావా? రాముడిని అని ప్రశ్నిస్తే సతీదేవి ముక్తసరిగా సమాధానం ఇచ్చినది. అప్పుడు శివుడు జ్ఞాన నేత్రంతో జరిగినది తెలుసుకొనెను. సీతమ్మ తల్లి రూపాన్ని గ్రహించిన సతీదేవిని ఇక గ్రహించను అని శపదం చేసెను. సిద్ధులు, చారిణులు శివుడి నిర్ణయానికి సంతోషించారు. ఈ విషయం తెలుసుకొన్న సతీదేవి బాధపడి 87,000 సం॥లు తపస్సు చేసి దక్షయజ్ఞంలో శరీరాన్ని త్యజించినది. మరలా హిమవంతునికి పుత్రికగా పుట్టి ఈశ్వరుడిని చేరుకుంటుంది తులసీ రామాయణంలో. ఆధ్యాత్మ రామాయణం కూడా పార్వతీదేవికి సతీదేవికి కలిగిన సంశయమే కలిగినది.

సీతమ్మను అడవిలో వదలి వచ్చిన లక్ష్మణుడికి మనస్సు అసహనంగా, చిరాకుగా వుంది. ఈ మాయలో సంసారాన్ని దాటే ఉపాయం తెలుసుకోవాలని ఏకాంతంగా కూర్చున్న శ్రీరాముడిని సమీపించి, లక్ష్మణుడు భక్తితో ప్రణమిల్లాడు. లక్ష్మణుడు అంటే కర్మయోగం ద్వారా మనస్సు శుద్ధిని పొందినవాడు. ఇక్కడ భక్తి అంటే ప్రారంభ దశలో పూజలు చేయుట, కాని నిజమైన భక్తి భగవంతుని యందు అమితమైన ప్రేమను కలిగి వుండడము. భగవంతుడి కథల యందు ఆసక్తి కలిగి వుండటము భక్తి. లక్ష్మణుడిది అంత ఉత్కృష్టమైన భక్తి, అందుకే ఇప్పుడు ముముక్షుత్వాన్ని కోరుకుంటున్నాడు. దేవహౌతి కూడ తన పుత్రుడైన కపిల మునిని అడుగుతుంది. ఇంద్రియ విషయాలన్నీ అనుభవించిన తర్వాత వానియందు విరక్తి కలిగినది.



కాబట్టి వీటి నుండి విముక్తిని పొందే జ్ఞానం ఏదైతే వుందో దాన్ని నాకు ఉపదేశించు అని, అప్పుడు ఆయన ఆమెకు జ్ఞానాన్ని ఉపదేశిస్తాడు.

భాగవతంలో చెప్పినట్లు మానవజన్మ లభించడం దుర్లభం. శరీరమనే ఈ నౌక భవ సముద్రాన్ని దాటడానికి గురువు అనే నావికుడు లభించినప్పుడు ఆత్మజ్ఞానం కోసం ప్రయత్నించ కుండా వున్నవాడు ఆత్మహత్య చేసుకున్నవాడితో సమానం. ఈ మానవ జన్మలోనే మనం సాధన చేయడానికి అవకాశం వున్నది. అలా చేయనివాడిని శంకరాచార్యులు మూఢః అంటున్నారు. వివేకాన్ని కలిగి వుండడమే నిజమైన భక్తి.

పరమాత్ముడు విశుద్ధమైన జ్ఞాన స్వరూపుడు, అన్ని దేహాలలోను ఆత్మయై వున్నాడు. అన్నింటికి అధిపతి, నిరాకారి, మహామతి, జ్ఞానములన్నింటికి ఆధారమైనవాడు, నిర్గుణుడు అని నిరాకారతత్వాన్ని చెబుతున్నాడు. ఇంతటి ఉత్కృష్టమైన భక్తి భగవంతుని పట్ల మనకు ఎప్పుడు కలుగుతుందంటే సత్ సాంగత్యం వలన తద్వారా వివేకం కలుగుతుంది. ఉద్ధవుడితో శ్రీకృష్ణుడు చెబుతాడు. నీవు నన్ను చేరాలి అంటే ఒకటి భక్తి, రెండవది సత్‌సాంగత్యం ఉండాలి అని. వీటి వలన పవిత్రత ఏర్పడుతుంది. భర్తృహరి 100 మంది మూర్ఖులతో కలిసి ఇంద్రలోకంలో వుండే కన్న, అడవిలో వుండే వనచరమలతో జీవించడం మేలు అని.

ఒకసారి తిలక్ తన స్నేహితుడి ఇంటికి వెళుతాడు. నాన్నగారు లేరు పూజ చెయ్యి అని పిల్లవాడిని తల్లి అంటుంది. అప్పుడు ఆ బాలుడు తిలక్ పూజ ఎప్పుడూ చేయలేదు. నేను కూడ చేయను అంటాడు. అప్పుడు ఆ బాలుడిని తిలక్ పిలిచి, డాబా మీదకు తీసుకెళ్ళి ప్రజల్ని చూపించి వీరందరిని నేను సేవిస్తున్నాను, పూజిస్తున్నాను, నీవు కూడా ఆ స్థాయికి వచ్చిన తర్వాత పూజ చేయనవసరం లేదు. ఇప్పుడు వెళ్ళి అమ్మ చెప్పినట్లు పూజ చేయి అంటాడు బాలుడితో. సగుణ ఉపాసనో, నిర్గుణం ఉపాసనో ఏదో ఒకటి చేయాలి. ఏదీ చేయని వారికి దుర్గుణం ఏర్పడుతుంది.

శ్రీరామకృష్ణులు అంటారు దుస్సాంగత్యం చేయకూడదు అని. అది మనల్ని లాక్కొని వెళ్ళిపోతుంది. సాధకుడు మంచి పరిపక్వ స్థితికి వచ్చితే తప్ప దుస్సాంగత్యాన్ని సమానంగా స్వీకరించలేడు. ఆస్ట్రేలియాలోని కంగారు అనే జంతువు బిడ్డకు ఆపద కలిగితే తల్లి యొక్క సంచిలోకి దూరిపోతుంది. అలాగే మనకు దుస్సాంగత్యం ఏర్పడినప్పుడు మన మనస్సును దైవం వైపు మల్లించాలి. తులసీదాస్ అంటాడు సత్‌సాంగత్యంతో విషపు కాకులు, కోయిలలు, కొంగలు, హంసలుగా మారుతాయట. విషపు పాము యొక్క పడగలో మణి ఎలా ప్రకాశిస్తుందో ఆ విషాన్ని అంటకుండా, అలాగే సజ్జనుడు దుస్సాంగత్యంలోను ప్రకాశిస్తాడు. హనుమంతుడు విభీషనుడిని అడుగుతాడు ఈ రాక్షసుల మధ్య నీవు ఎలా జీవిస్తున్నావు అని. విభీషణుడు అన్నాడట దంతముల మధ్య నాలుకవలె జీవిస్తున్నాను అతి జాగ్రత్తగా !

యోగులు ఎప్పుడూ పరమాత్మను ధ్యానిస్తూ వుంటారు. ధ్యానం 3 స్థాయిలలో జరుగుతుంది. మొదటిది సగుణ రూపంలో పాదాల నుండి శిరస్సు వరకు ఆయన రూపాన్ని ధ్యానించడం. రెండవది భగవంతుడి గుణగణాలను ధ్యానించడం, మూడవది స్వరూప స్థితిని ధ్యానించడం అంటే ఆయన నిరాకారతత్వాన్ని ధ్యానించడం. భగవంతుడు తప్ప మరేమి లేదు. మరేమి వద్దు అనుకున్నప్పుడే ధ్యానస్థితి లభ్యం అవుతుంది ఎలాగైతే పసిబిడ్డ తల్లికై విలపించినప్పుడు ఎన్ని మిఠాయిలు ఇచ్చినా, బొమ్మలు ఇచ్చినా స్వీకరించడో! శ్రీరామకృష్ణ పరమహంస 6 సం॥ నిద్రపోలేదట. అంతటి తపన వుండేదట ఆయనకు భగవంతుడి కోసం. దేహాభిమానం వున్నంతవరకు నిరాకార ఉపాసన కష్టం. అందుకే ప్రారంభంలో సాకార ఉపాసన చేస్తాము. సత్‌సంగం వలన వివేకము కలుగుతుంది. వివేకం వలన ఈ సంసార మాయ నుండి విడుదల పొందుతాము. శ్రీరాముడు లక్ష్మణుడికి బోధిస్తాడు. పవిత్రమైన అంతరంగం ద్వారా భగవంతుడ్ని తెలుసుకోగలము. ఇటువంటి జ్ఞానాన్ని పొందుటకు ఎవరికి అర్హత ఉన్నది అంటే వర్ణ ఆశ్రమ ధర్మాలను చక్కగా నిర్వహించి, మనస్సును శుద్ధం చేసుకున్న వారికి వర్ణాశ్రమ ధర్మాలను చక్కగా నిర్వహించిన తర్వాత ఇక ఆ కర్మలను త్యజించి, ఉత్తమమైన సాధన చేయుటకు అర్హత సంపాదించి శరణాగత భావనతో సద్గురువుని ఆశ్రయించాలి. ఆశ్రమ ధర్మానుష్టానంలో వృత్తి ధర్మం చక్కగా అనుష్ఠించడం వలన భగవత్ ప్రాప్తి లభిస్తుంది అని మనకు జాబాలుడు – తులాధరుడి కథ నిరూపిస్తుంది. ఇక్కడ జాబాలుడు అనే సమాధి స్థితికి చేరిన ఋషిని ఆకాశవాణి ఆదేశిస్తుంది. తులాధరుడు అనే నూనె వ్యాపారి దగ్గరకు వెళ్ళి ఉపదేశం పొందు అని. ఎందుకంటే తులాధరుడు కేవలం తన వృత్తిని ధర్మబద్ధంగా చేయుటవలన ఆయనకు భగవత్ అనుగ్రహం కలిగినది.

# కార్యక్రమము

## మాతృఆశ్రమము నందు గీతాహవనము

**తేది. 27-11-2017 నుండి తేది. 29-11-2017 వరకు** గీతా జయంతి సందర్భముగా గీతాహవనము యాగశాల యందు ఉదయం గం॥ 7.30 ని॥లకు **బ్రహ్మచారి శాంతానంద గారిచే** నిర్వహించబడును.

**తేది. 29-11-2017 (బుధవారం)న** మైత్రేయ ఆశ్రమము నందు శ్రీకృష్ణ అష్టోత్తర శతనామార్చన మరియు భగవద్గీత పారాయణం **శ్రీ గంగరాజు మాష్టారు గారిచే** నిర్వహించబడును.



# కర్మ

**(మాతృ ఆశ్రమంలో తేది. 11-10-2017న ఇచ్చిన దివ్య సందేశ సారాంశము)**

***– సాధు భీష్మాజీ,*** అన్నిన్ కుడిల్, ఈరోడ్

**సంపూర్ణ శరణాగతి పొందిన వ్యక్తి విషయంలో విధి తనవ్రాతను తానే తుడిచి వేసుకొంటుంది.**

మానవ జన్మ మూడు కర్మలతో ప్రాప్తిస్తుంది. సంచిత, ప్రారబ్ధ, ఆగామి. మనం దేహంతో చేసే పాప పుణ్యకర్మలు ఆగామి కర్మలు. ఇవి వచ్చే జన్మలో మన స్థితికి కారణమవుతాయి. అనంతకోటి జన్మలకు విత్తనంవంటిదై పూర్వం ఆర్జించుకున్న కర్మ సంచిత కర్మ. దీన్ని ఈ జన్మలో మనం అనుభవిస్తాము. మన జన్మ సరిపోకపోతే తర్వాత జన్మలో కూడా వీటి ప్రభావం వుంటుంది. ఈ జన్మలో అనుభవించుచున్నది ప్రారబ్ధ కర్మ. మనం ఈ జన్మలో చేసే పుణ్యం క్రితం జన్మలో చేసిన, ఈ జన్మలో చేసిన పాపకర్మ కన్నా ఎక్కువగా వుంటే ప్రారబ్ధ కర్మతో బాటు, సంచిత కర్మ కూడా నశించి మనిషి ముక్తుడవుతాడు. ఈ మూడు కర్మల వలననే మనము జనన మరణ చక్రంలో పడుతున్నాము. 'నేను, నాది' అనే రెండు భావనల వల్లే మనకి బాధలు ప్రారంభమవుతున్నాయి. మనం మనల్ని ప్రశ్నించుకోకుండా సాక్షీభూతుల మయితే, ఏ బాధలు వుండవు. మానవునికి మనసు వుంది. దీని వలనే కర్మలను ప్రోగు చేసుకొని పునర్జన్మ పొందుతున్నాము. జన్మించిన ప్రతిబిడ్డ హృదయంలో గత జన్మ కర్మలు పొదులుతుంటాయి. పది సంవత్సరాల వరకు ముందు జన్మ ఫలితాలు అనుభవిస్తూ వుంటారు. ఈ జన్మ కర్మలేవీ అంటవు. పది సంవత్సరములు వయసు నుండి లోకజ్ఞానం పొంది కొత్త కర్మలు పోగు చేసుకుంటాడు.

మనం చేసే పనులు సంగరహితంగా చేయాలని భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు బోధించాడు. చేయవలసిన కర్మలను భగవదర్పితంగా చేయాలి. అప్పుడు మన బాధ్యత భగవానుడే తీసుకుంటాడు. కుటుంబ నిర్వహణ మన కర్తవ్యం అనుకుంటాము. అది మన బాధ్యతని చేస్తాము కానీ పరమాత్మపై భారం వేసి, నిమిత్తమాత్రులుగా మన పని మనని చేయమని భగవానుడు చెప్పాడు. కానీ మనం మనమే కర్తలమని అనుకుంటాము. అందువలనే మనకి బాధలు కలుగుతున్నాయి. మనం ఏ రూపాన్ని పూజించినా ఆ దైవాన్ని శరణాగతి వేడాలి.

గుజరాత్‌తో మాధవదాసుడనే కృష్ణభక్తుడు నిరుపేద. రోజూ గీతాపారాయణం చేసి,

గీతని నమ్మినవాడు. గీతలోని **'అనన్యా శ్చింతయంతో మాం-యేజనాః పర్యుపాసతే-తేషాం నిత్యాభియుక్తానాం-యోగక్షేమం వహామ్యహమ్'** అనే శ్లోకాన్ని నమ్మినవాడు. కానీ అతని ఆర్థిక పరిస్థితి మరీ క్షీణించి సంసార పోషణ చేయలేకపోయాడు. తన ప్రారబ్ధమే ఈ బీదరికం అనుకున్నాడు. అతనికి దేవుడిపైన, ఈ గీతా శ్లోకంపైన నమ్మకం నశించింది. గీతలోని ఈ శ్లోకంను కొట్టివేశాడు. ఈ పత్రాన్ని గుడిలో విసిరివేసాడు. పదహారు సంవత్సరముల ప్రాయం గల ఒక యువకుడు వారింటికి వంట సంబారాలు బండిపై వేసుకొని వచ్చి, మాధవుని భార్యను తీసుకోమన్నాడు. దారిలో నది పొంగడం వల్ల వరదలో రాలేక సరుకులు తేవడం నాలుగు రోజులు ఆలస్యమయినదని, మాధవునికి కోపం వచ్చి తనని కొట్టాడని తన వీపుపై రక్తం కారుతున్న వాతలను చూపించాడు. మాధవుని భార్య ఇంటికి వచ్చిన భర్తతో వాతలను గురించి చెప్పి, ఆ యువకుడు తెచ్చిన సామాగ్రిని చూపించింది. మాధవునికి వచ్చినదెవరో అర్థమయ్యింది. తను గీతా శ్లోకంపై అడ్డంగా గీయడం వల్లనే ఆ యువకునికి వీపుపై వాతలు పడ్డాయని గ్రహించాడు. భార్యకు కృష్ణ దర్శనం అయినందుకు సంతోషించాడు. తన ప్రారబ్ధం అడ్డుకోవడం వలనే తనకు దైవదర్శనం అవ్వలేదని గ్రహించాడు.

బహు కుటుంబీకుడయిన నారాయణ, ఇతరుల ఆస్తులను, ధనాన్ని దోచి, కుటుంబాన్ని పోషించేవాడు. శ్రీమహావిష్ణువు ప్రేరణతో నారదుడు అతన్ని సంస్కరించాలనుకున్నాడు. దొంగతనం చేయవద్దు. ఈ పాప ఫలితాన్ని నీవే అనుభవించాలని నారదుడు దొంగతో చెప్పాడు. తనకు తెలిసిన మార్గం ఇదేనని, తన సంపానదతో బాటు, తన పాపం కూడా కుటుంబ సభ్యులు పంచుకుంటారని నారాయణ బదులిచ్చాడు. కనిపించే వస్తువులను పంచు కుంటారు గాని, కనబడని పాపపుణ్యాలను ఎవరూ పంచుకోరని నాదుడు వివరించాడు. విషయ నిర్ధారణ కోసం చోరుడు కుటుంబంలోని వారందరినీ పాపంతో పాలు పంచుకోమని అడిగాడు. కుటుంబ యజమానికి అతని బాధ్యత కుటుంబ పోషణనీ, దానిని నెరవేర్చడంలోని కష్టనష్టాలకు తమ బాధ్యత లేదని వారందరూ చెప్పారు. భార్య కూడా 'గృహసేవ గృహిణి ధర్మం, గృహపోషణ భర్త ధర్మం' అంది. నారదుడు అతనికి సంపాదనా మార్గం న్యాయంగా లేకపోతే ఆ పాపం అతనే అనుభవించాలని చెప్పాడు. పూర్వజన్మలో అతను ఒక ఋషి అని **కర్మాను** సారం దొంగగా జన్మించాడని తెలియచేశాడు. రామనామంతో తరించమన్నాడు. రామనామం నోట తిరగని అతనికి 'మర' అనే వృక్ష నామంతో రామనామం తిరగేసి ఉపదే శించాడు. అతనే వాల్మీకి అయి రామజన్మకు ముందే రామాయణం రాశాడు. పక్షిజంటలోని ఆడపక్షిని వేటాడిన బోయవాడిని చూచి శోకించి, ఆ బోయవాడికి పత్నీ వియోగ శాపం ఇచ్చాడు. ఆ బోయవాడే శ్రీమన్నారాయణుడు. ఇది రామజన్మకి కారణం.



పరమాత్మని ఏ నామంతో అయినా ధ్యానించవచ్చు. మనోవాసనలు నామస్మరణతో నశిస్తాయి. శ్రీకృష్ణ నామం ఉత్తమమైనదని మహాత్ముల అభిప్రాయం. పూర్వవాసనల వచ్చే వ్యతిరేక భావాలు నామజపం వల్ల క్షయమవుతాయి. **"శ్రీకృష్ణ గోవింద హరే మురారే హేనాథ నారాయణ వాసుదేవ"** నామం ఇరవై నాలుగుసార్లు రోజూ జపం చేయడంవల్ల చెడువాసనలు పోతాయి.

> **"ఆనందంగా సంతోషంగా ఉన్న మనస్సు దైవ ప్రేరిత సలహాలను, ఆశీస్సులను వెంటనే గ్రహించగల్గుతుంది. ఎల్లప్పుడు ఉల్లాసంగా ఉండటానికి ప్రయత్నం చేయి. ధ్యానంలో దైవ ప్రేరణతో వచ్చిన ఆనందాన్ని, సంతోషాన్ని నిరంతరం ఉంచుకుందుకు ప్రయత్నం చేయి.**
>
> **- పరమహంస యోగానంద**

# దైవసాయుజ్యము

1) ఆనందాశ్రమం వాసులు, శాంతి ఆశ్రమ శ్రేయోభిలాషులు **శ్రీమతి లక్ష్మీ మహాదేవన్ గారు** తేది. 1-10-2017న దైవసాయుజ్యం పొందిరి.

2) విశాఖపట్నం వాస్తవ్యులు **శ్రీ కాసిం మెహది గారు** విశాఖ శాంతి ఆశ్రమ ఓంకార్ & లైన్స్ బధిరుల పాఠశాలలో ప్రారంభకాలము నుండి సభ్యులుగాను, కోశాధికారిగాను సేవలందించారు. వీరు తేది. 7-10-2017న దైవసాయుజ్యం పొందిరి.

3) కోటగిరి వాస్తవ్యులు, శాంతి ఆశ్రమ భక్తులు శ్రీ రామచంద్రన్ గారి భార్య **శ్రీమతి కమల గారు** తేది. 10-10-2017న దైవసాయుజ్యం పొందిరి.

4) మాతృఆశ్రమ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ భగవాన్ గారి మాతృమూర్తి **శ్రీమతి పి. రాఘువమ్మ గారు** పెద్దాపురం వాసులు, స్వామీజీ వున్నప్పటి నుండి ఆశ్రమ భక్తులు, ఆశ్రమ శ్రేయోభిలాషులు తేది. 14-10-2017న దైవసాయుజ్యం పొందిరి.

పై వారందరి ఆత్మశాంతి కోరుతూ మృత్యుంజయ మహామంత్రము, శాంతి ప్రార్థన ఆశ్రమవాసులచే చేయబడినది. అన్నదానము చేయబడినది.

# భగవద్గీత

- జమ్మలమడక సుబ్బలక్ష్మి
శాంతి ఆశ్రమ సభ్యురాలు, కాకినాడ.

## కోమలమైన హృదయము జ్ఞానం పొందగలుగుతుంది

అందరూ "గీత"ను చదివి దాని సారము తెలుసుకోవాలి. మానవుడిని దేవుడుగా మార్చగల శక్తి స్తోమత గీతాబోధనకు కలదు. మీరు పిల్లలకు నేర్పించండి, చదివించండి. దాని ఫలితము వుంటుంది. నిష్కామకర్మాచరణము ద్వారా భక్తి, భక్తి వలన జ్ఞానము, జ్ఞానము వలన మోక్షము లభించును. ఇదియే సర్వశాస్త్ర సిద్ధాంత సార సంగ్రాహము అని మహాత్ములు వచించిరి. జ్ఞానమే గీత యొక్క అదియే గీత గ్రంధము యొక్క తాత్పర్యమని మానవుని దేవునిగా మార్చవేయగల శక్తిస్తోమతలు గీతకు కలవు. సర్వమానవులకి గీతా మాత వారికి చక్కని ద్రోవను చూపును. నాలుగు యోగములు గూర్చి సంక్షేపముగా తెలుసుకొని ఒకింతైనను ఆకళింపు కాగలదు. మరియు జీవితమే ఒక యుద్ధరంగము. ప్రతిదినము ధర్మా, ధర్మములకు, సత్యాసత్యములకు, న్యాయన్యాయాలకు భీకరపోరు మానవుని చిత్త కుహరమున జరుగును. జనులకు బోధించుటకు ఆ స్థూల సంగ్రామమును గీతాబోధకు తగ్గ క్షేత్రముగ నెన్నుకొని యుండవచ్చును. పిన్నలలోను, పెద్దలలోను గీతాతత్వము నెరింగిచి మహానీయుల చేత గీతోపన్యాసములు, గీత పోటీలు, గెలుపు పొందినవారికి గీత సంబందమైన పుస్తకాలు ఇవ్వవలెను. అట్టి విద్యావినోదముల కలయికచే జనులకు గీతా పరిచయము గావించుట చక్కని మార్గము. మహాశయులారా మరో అర్ధాంతని సూచిస్తారు. ఆ విషయాన్ని గ్రహించవచ్చు. విద్య వినయ సంపన్నులైన బ్రాహ్మనుడంటే బుద్ధి, గోవు అంటే చిత్తము, కుక్క అంటే మనస్సు, ఏనుగు అంటే అహంకారం, శ్వపాకుడు అంటే మనస్సుతో దాత్మక కల్గిన జీవుడు. యుక్తా యుక్తా విచక్షణా జ్ఞానం దేనికి ఏడవకూడదో, దేనికి భయపడకూడదో తెలుసుకొనే పరిజ్ఞానమనే చురకత్తికి ఎలా పదును పెట్టాలో భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు మనకి చెప్పెను. ఆఖరిగా ఒక మాట భగవద్గీత జ్ఞానం. ఒక దీపం. కాబట్టి గీతను అందరి చేత చదివించండి.



### విజ్ఞప్తి !

# గోశాల పునర్నిర్మాణము

**ఓం నమో భగవతే ఓంకారాయ**
**ఓం నమో భగవతే వాసుదేవాయ**
**ఓం శ్రీ గోమాత్రే నమః**

దివ్యాత్మ స్వరూపులకు ప్రణామములు. పూజ్య ఓంకారస్వామి స్థాపించిన గోశాలలో గోవులు - 25, దూడలు - 30, గిత్తలు - 7, దినాభివృద్ధి గావింపబడుతున్నాయి. గోఘృతంతో నిత్యం ప్రణవ హోమం నిర్వహించబడుచున్నది. గురుకుల బాలబాలికలకు, ఆశ్రమ వాసులకు గోక్షీరము వినియోగింపబడుచున్నది. గోమాతలు వశించు గోశాల శిథిలావస్థకు వచ్చినది. పూజ్య స్వామీజీ వారి ఆశీస్సులతో గోశాల పునర్నిర్మాణము చేయుటకు పూజ్య జ్ఞానేశ్వరి మాతాజీవారు సంకల్పించిరి. గోమాతలు నివశించుటకు 5 షెడ్డులు అవసరమున్నవి. ఒక షెడ్డు నిర్మాణమునకు సుమారు రూ॥ 5,00,000/- (ఐదు లక్షలు) ఖర్చు అగునని నిర్ధారణ చేయబడినది.

రూ॥ 10,000/- (పదివేలకు) పైన ఇచ్చిన దాతల పేర్లు శిలాఫలకము మీద వ్రాయబడును. ఒక రోజునకు ఒక ఆవుకు గ్రాసము ఖర్చు రూ॥ 150/-. ఒక నెలకు ఒక ఆవుకు గ్రాసము ఖర్చు రూ॥ 4,500/- అగును. వారి వారి శక్తి అనుసారము గ్రాసమునకు దాతలు సహకరించవలసినదిగా మా విన్నపము. గోగ్రాసమునకు సమర్పించిన దాతల నామ గోత్రములతో, గోవులకు గ్రాసము అందించబడును. ఒక గోవునకు సమర్పించిన గ్రాసము 10 అశ్వమేధ యాగములకు సమానము అని గోమహత్యంలో చెప్పబడినది.

ఆశ్రమ శ్రేయోభిలాషులు, గోమహత్యం పట్ల విశ్వాసం ఉన్న వాళ్ళు గోశాల పునర్నిర్మాణము మరియు గోగ్రాసము కొరకు ధన రూపంలో లేదా డి.డి. గాని, చెక్కు గాని శ్రీ శాంతి ఆశ్రమం పేరున విరాళము పంపగలరని విజ్ఞప్తి. మీ విరాళమునకు 80జి ప్రకారము ఇన్‌కంటాక్సు మినహాయింపు కలదు.

**ఓం తత్‌సత్**

గురుసేవలో
- *వినమ్రానంద సరస్వతి*

# వార్తలు - మాతృ ఆశ్రమం

**తేది. 5-10-2017 నుండి ది. 11-10-2017 :** శ్రీ షిరిడి సాయిబాబా శతవర్ధంతి ఉత్సవాల సందర్భంగా వారి జీవిత చరిత్ర పారాయణం అత్యంత శ్రద్ధాభక్తులతో ఆశ్రమ వాసులు చేసిరి.

**తేది. 13-10-2017 :** పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి 87వ జన్మదినం భక్తులందరూ అత్యంత వేడుకగా జరుపుకున్నారు. శాంతి ఆశ్రమ ఉపాధ్యక్షులు శ్రీ సాయిబాబా గారి ఆధ్వర్యంలో ఉదయం గం॥ 5.30 ని॥లకు శాంతి గణపతికి, శాంతి స్థూపంలోని ఓంకార స్వామికి పుష్పమాలాంకరణ చేసి అఖండ హరేరామ సంకీర్తనతో ఈ దినము ప్రారంభము అయ్యెను. తదుపరి స్వామిని వినమ్రానంద మాతాజీ, బ్రహ్మచారిణి సుహిత చైతన్య గార్లచే శ్రీ ఓంకారస్వామి పాదుకాపూజ నిర్వహించబడెను. తదుపరి మాతాజీ వారు మౌనంలో భక్తులందరిని ఆశీర్వదించిరి. ఆయుష్ హోమం బ్రహ్మశ్రీ ద్విభాష్యం సీతారామశాస్త్రి గారిచే నిర్వహించబడెను. ఉదయం 11 గం॥లకు శ్రీ సాయి భగవత్‌గీత బృందం, కాకినాడ వారిచే భగవద్గీత, పారాయణం కార్యక్రమం నిర్వహించబడినది. ఇందులో 3-5 సం॥ల బాలబాలికలు కూడ గీతా శ్లోకాలను పఠించడం ఒక విశేషం. తదుపరి అన్నదానం, వస్త్రదానం జరిగెను. సాయంత్రం గం॥ 3.30 ని॥లకు శ్రీ కరుటూరి వెంకట శ్రీనివాసరావు, ప్రచారకులు సనాతన హిందూ ధర్మం, అంకంపాలెం వారి యొక్క బృందంచే త్యాగరాజ కీర్తనలు అతి మధురంగా ఆలపించబడెను.

సాయంత్రం 6 గం॥లకు మాతాజీ వారి జన్మదినసభలో శ్రీ భీష్మాజీ మాట్లాడుతూ భగవంతుడ్ని నేరుగా తెలుసుకోలేమని కేవలం సద్గురువు లేదా మహాత్ముల ద్వారానే తెలుసుకోగలము అని, శాస్త్రాలు కూడా జ్ఞానాన్ని ఇస్తాయి గాని అనుభవ జ్ఞానాన్ని ఇవ్వలేవని, అనుభవ జ్ఞానాన్ని ఒక్క సద్గురువు మాత్రమే ఇవ్వగలరని, అలాంటి కోవకు చెందిన జ్ఞానేశ్వరి మాతాజీ సన్నిధిలో వుంటున్న ఆశ్రమ వాసులందరు ధన్యులని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తమ జీవితాలను ఉన్నతివైపుకు తీసుకెళ్ళాలని తమ ఆకాంక్షను వ్యక్తపరచారు.

తర్వాత రాచపల్లి రమణాశ్రమము నుండి శ్రీరామస్వామి గారు మాట్లాడుతూ, శాంతి ఆశ్రమ కార్యక్రమముల సందర్భాలలో అఖండ నామ సంకీర్తన (ఏకాహం) నాటి నుండి నేటి వరకు జరగడం అనేది ఈ తపోభూమికి గొప్ప కాంతిని, తేజస్సును



అందిస్తోంది. అమ్మదయ వుంటే అన్నీ వున్నట్లే! ఈ అమ్మ అందరికీ అమ్మే అని జ్ఞానేశ్వరి మాతాజీను కొనియాడుతూ, గురువుగారైన ఓంకారస్వామి ఆమె గొప్పతనాన్ని ఎలా శ్లాఘించారో, ఈ సందర్భంగా గుర్తు చేశారు.

"అమ్మ లేనిదే జగతికి ఉనికి లేదురా
అమ్మ లేనిదే ప్రగతికి పనికిరాదురా
అమ్మంటే పుడమి మీది చందమామరా
అమ్మంటే పాలకడలి చందంబురా
అమ్మంటే బ్రహ్మరా ఈ జన్మపంట అమ్మరా" అంటూ, మాతృమూర్తిపట్ల తన భావాల్ని తెలియజేశారు. మాతాజీది యోగ శరీరం. 30 సంవత్సరాల నుండి చూస్తున్నాం నాటికి, నేటికి ఆమె. శరీరం అలాగే చురుగ్గా, కాంతివంతంగా వుంది. దానికి కారణం ఆమె ఎన్నో ఏండ్ల నుండి యోగులకు, భక్తులకు సేవ చేయడమే !

తరువాత బ్రహ్మచారి హరిహర సుబ్రహ్మణ్యం గారు మాట్లాడుతూ, శ్రీరామ చంద్రుడు పితృవాక్య పరిపాలన చేసినట్లు, జ్ఞానేశ్వరి మాతాజీవారు సుమారు 11 సం॥ల ప్రాయంలో తన తండ్రి మాటలకు కట్టుబడి, ఆయన మాటల యందు శ్రద్ధ కలిగి వుండి, ఓంకారస్వామి దగ్గరకు వచ్చారు అంటూ ఈ విశేషనము చెబుతూ మాతాజీ వారికి తండ్రి మాటల యందు, గురువు మాటల యందు శ్రద్ధ ఒకరు చెప్పితే వచ్చినది కాదు, అది కేవలం పూర్వజన్మ సంస్కారము వలనే ప్రాప్తించినది. పుట్టుకతోనే వారికి వచ్చినది అన్నారు.

చివరిగా సుగుణక్క (విజినిగిరి) మాట్లాడుతూ మహాత్ముల జన్మలు కారణ జన్మలు. వారి ద్వారా కొందరైనా ఉద్ధరించబడతారు. మహాత్ములు జన్మదినోత్సవాలు మనల్ని ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితివైపుకు వెళ్ళడానికి ఉత్తేజపరుస్తాయి. ఓర్పు, సహనం, ప్రేమ, కరుణకు మారుపేరు మాతాజీ అనేది తాను అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను అన్నారు. మహాత్ముల దర్శన స్పర్శన సందర్శన భాగ్యానికి మనం నోచుకోవాలి. అందుకే ఇలా జన్మదినోత్సవాల్ని జరుపుకుంటున్నాం. లలితా సహస్రనామాలలో చెప్పబడినట్లు-

మూలాధారైక నిలయా బ్రహ్మ గ్రంధి విభేదినీ
మణిపూరాంత రుదితా విష్ణు గ్రంధి విభేదినీ
ఆజ్ఞా చక్రాంతరాళస్థా రుద్ర గ్రంధి విభేదినీ

మహాత్ముల సన్నిధానంలో వున్నప్పుడు ఈ 3 గ్రంధుల విభేదన జరుగుతుంది.

తద్వారా నేను, నాది అనే మమకార, అహంకారాలు, నేను ఈ శరీరము అనేటటువంటి భావము, జగత్ మిధ్య అనే భావాలు మనలో తొలగుతాయి. వారి సన్నిధిలో బోధన, ప్రబోధన మనకు తెలియకుండానే జరుగుతూ వుంటాయి.

"సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం, నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః"

అన్నదే ఓంకారస్వామి నుండి మాతాజీ వారు చేసిన సాధన అని అన్నారు. శ్రీ ఆంజనేయులు గారి శాంతి ప్రార్ధనతో నాటి సభ ముగిసినది.

తేది. 14-11-2017న ఉదయం 8 గం॥లకు ఏకాహం పూర్తి చేసిన మల్లవరం అవధూత భక్తమండలి మరియు చేబ్రోలు భక్తులను ఉద్దేశించి స్వామిని వినమ్రానంద వారు ఇలా మాట్లాడారు. "రామనామం అనే మణిదీపం ఎవ్వరి జిహ్వాయందు ధరిస్తారో వారికి లోపల బయట వెలుగుతో నిండి వుంటుంది. ఆ వెలుగు కారణంగా అజ్ఞానం నశిస్తుంది. స్వామీజీ చెప్పిన తేజస్సులకు తేజస్సునై వున్నాను అన్న స్థితిని మనం ఈ నామసంకీర్తన ద్వారా పొందవచ్చు. ఎన్నో జన్మల సుకృతం వలన మనకు ఈ సంకీర్తన చెయ్యాలనే ఆలోచన వచ్చినది. కాబట్టి మీరందరూ ధన్యజీవులు".

బ్రహ్మలీన పూజ్యశ్రీ స్వామి చిదానంద వారి జన్మతేది 24న ప్రతినెల వలె ఈ నెల కూడ మాతృ ఆశ్రమం, పిఠాపురం, కాకినాడ, విశాఖపట్నం, కోటగిరి శాఖలలో వృద్ధులకు బియ్యం, పప్పు వితరణ కావించబడినది.

## సత్య జీవితము

*- డా॥ రాజేంద్ర ప్రసాద్*

**"సత్యమార్గము ననుసరించనిదే, మానవ సేవ చేయనిదే, న్యాయయుక్త జీవితము నవలంబించనిదే, నరుడు మోక్షము నందజాలడు. తన ఉనికియందున్న లోపములను, దుఃఖములను, అడ్డంకులను దాటలేడు అనునదే శతాబ్దముల తరబడి మన ఆదర్శమై యున్నది. మానవుడు చేయునదంతయు సమస్త లోకము కొఱకును, భగవంతుని ప్రీత్యర్థమునునై యుండవలెను. ఈ ఆదర్శమే భారతదేశపు గొప్ప కానుక. కాని, మనము ఐహికముగా కొంతటి మంచిదశను పొందనిదే, మన కూలీలు, రైతులు సైతమీ ఆదర్శమును జీర్ణము చేసుకొననిదే ఇది అసాధ్యము. అట్టి సువర్ణ యుగమును తీసుకురావలెనన్న మనము నిరంతరము కృషి చేయవలెను.**

*(కాశీ సంస్కృత విశ్వ పరిషత్తునకిచ్చిన ఉపన్యాసము నుండి)*



## శాశ్వత అన్నదాన పథకము

| | | |
|---|---|---|
| 1. | రూ. 5,000-00 | శ్రీ గోలి భాస్కరరావు గారు, వేట్లపాలెం, వీరి తల్లిగారు కీ॥శే॥ గోలి సీతాయమ్మ గారి జ్ఞాపకార్థం, వారి ఆత్మశాంతి కోరుతూ అన్నదానం |
| 2. | రూ. 5,000-00 | శ్రీ గోలి సత్తిరాజు గారు, S/o. బాపిరాజు గారు, వేట్లపాలెం వీరి ఆయురారోగ్యభాగ్యములు కోరుతూ... |
| 3. | రూ. 10,000-00 | శ్రీ కూనిశెట్టి ప్రభాస్ గారు, S/o. శ్రీ కూనిశెట్టి విద్యాసాగర్ గారు, విజయవాడ వీరి తండ్రి గారు కీ॥శే॥ కూనిశెట్టి విద్యాసాగర్ గారి జన్మదిన జ్ఞాపకార్ధము |
| 4. | రూ. 10,000-00 | శ్రీ కూనిశెట్టి ప్రభాష్ గారు, S/o. శ్రీ కూనిశెట్టి విద్యాసాగర్ గారు, విజయవాడ వీరి తండ్రి గారు కీ॥శే॥ కూనిశెట్టి విద్యాసాగర గారు స్వర్గస్తులైన రోజు |
| 5. | రూ. 5,000-00 | శ్రీమతి ఆరుగుళ్ళ కృపావతి గారు, శంఖవరం, వీరి భర్త గారు కీ॥శే॥ ఆరుగుళ్ళ చిన్ని మాష్టారు గారి జ్ఞాపకార్థం |
| 6. | రూ. 5,000-00 | శ్రీ పుప్పాల షణ్ముఖ వెంకట శ్రీ సూర్య సాయి గారు, కాకినాడ, S/o. పుప్పాల వీరవెంకట సత్య సురేంద్ర గారు, వీరి పుట్టిన రోజు సందర్భంగా |
| 7. | రూ. 5,000-00 | శ్రీమతి మంతెన అనురాధ గారు, భీమవరం, (లేటు) మంతెన రంగరాజు గారి జ్ఞాపకార్ధము |
| 8. | రూ. 5,000-00 | శ్రీ ఎమ్. మురళీకృష్ణంరాజు గారు, భీమవరం, వీరి తాతయ్య గారు కీ॥శే॥ దాట్ల వెంకట నరసయ్య గారి జ్ఞాపకార్ధము |
| 9. | రూ. 5,000-00 | శ్రీమతి మంతెన అనురాధ గారు, భీమవరం, వీరి తాతయ్య గారు కీ॥శే॥ మంతెన వరహాలయ్య గారి జ్ఞాపకార్థం, ఆత్మశాంతి కోరుతూ |
| 10. | రూ. 5,000-00 | శ్రీ ముమ్మిడి వీరవెంకట సత్యనారాయణ గారు, శాంతి నగర్ (కాకినాడ) వీరి తండ్రిగారు కీ॥శే॥ ముమ్మిడి సత్తిరాజు గారి జ్ఞాపకార్ధము |
| 11. | రూ. 5,000-00 | శ్రీ ముమ్మిడి వీరవెంకట సత్యనారాయణ గారు, శాంతి నగర్ (కాకినాడ) వీరి తల్లిగారు కీ॥శే॥ ముమ్మిడి నూకరాజు గారి జ్ఞాపకార్ధము |
| 12. | రూ. 10,000-00 | శ్రీ కె. సీతారామరాజు గారు, విశాఖపట్నం, వీరి తల్లి గారు కీ॥శే॥ శ్రీమతి కొండ రామసుబ్రహ్మణ్యం గారి ఆత్మశాంతి కోరుతూ |
| 13. | రూ. 25,000-00 | శ్రీమతి అర్చన గారు, లక్నో వీరి పుట్టినరోజు సందర్భముగా |
| 14. | రూ. 25,000-00 | శ్రీ సార్థక్ గారు, లక్నో వీరి పుట్టినరోజు సందర్భముగా |
| 15. | రూ. 10,000-00 | శ్రీమతి దాసరి శేషారత్నం గారు, శ్రీ శాంతి ఆశ్రమం, వీరి తల్లి గారు కీ॥శే॥ దొంతుల సత్తిరాజు గారి వర్ధంతి సందర్భముగా |
| 16. | రూ. 10,000-00 | శ్రీమతి దాసరి శేషారత్నం గారు, శ్రీ శాంతి ఆశ్రమం, వీరి తండ్రి గారు కీ॥శే॥ దొంతుల వెంకట సుబ్బారావు గారి జ్ఞాపకార్ధము |

## గోగ్రాసం నిమిత్తం విరాళం

| | | |
|---|---|---|
| 1. | రూ. 1,000-00 | శ్రీ నల్లం సత్యనారాయణ గారు, కాకినాడ, వీరి పుట్టినరోజు సందర్భముగా |
| 2. | రూ. 4,500-00 | శ్రీ సి.హెచ్. శ్రీ రామారావు గారు, విశాఖపట్నం. |

## పూజలు - పండుగలు నిమిత్తం విరాళం

| | | |
|---|---|---|
| 1. | రూ. 5,488-00 | శ్రీ శాంతి ఆశ్రమవాసులు మరియు భక్తులు, శ్రీ శాంతి ఆశ్రమము దేవీ నవరాత్రులు సందర్భముగా భక్తులు విరాళములు |